# కాలం చెల్లిన తినుబండారాలు అమ్ముతున్న యజమానులపై కేసులు నమోదు



**నరసాపురం రూరల్,మేజర్‌న్యూస్ :** మండలంలోని చర్ల గ్రామంలో వంకాయల రాజుకి చెందిన కిరణా &ఫాన్సీషాపులో కాలంచెల్లిన తినుబండారాలను (కుర్‌కురే&లేస్)ప్యాకెట్లుస్కూల్ పిల్లలకు విక్రయిస్తున్నట్లుగా ఉన్నతాధికారుల వద్ద నుంచి వచ్చిన సమాచారం మేరకు అసిస్టెంట్ ఫుడ్ కంట్రోలర్ యం శ్రీనివాస రావు, జిల్లా ఫుడ్ సేఫ్టీ అధికారి ఏయస్ఆర్ రెడ్డి ఆధ్వర్యంలో శుక్రవారంతనిఖీ నిర్వ హించాగా మొత్తం85 ప్యాకెట్లను గుర్తించి వాటిని సీజ్ చేసి షాపు యజమాని పై కేసు నమోదు చేశారు.వీరి కుమారునకు చెందిన మరియొక షాపు ఇదే గ్రామంలోకృష్ణవేణి కిరాణా షాపును తనిఖి చేయగా కాలం చెల్లిన తినుబండారములు 41 ప్యాకెట్లు తనిఖీ సమయంలో ఉన్నవి.వాటిని స్వాదీన పరచుకుని షాపు యజమాని వంకాయల వెంకట సురేష్‌అనువారిపై ఫ్‌యస్‌యస్ యాక్టు 2006 కిందకేసు నమోదు చేశారు. ఈ తనిఖీలో నరసాపురంసి యస్ డీటీ ఐవివి సత్య నారాయణ,

- తరువాయి 2లో..

నేటి దినపత్రిక
18వ
సూర్య
www.suryaa.com
ఏలూరు జిల్లా, పశ్చిమ గోదావరి జిల్లా
శనివారం,16 నవంబర్ 2024 8 పేజీలు

## కొల్లేరులో ఆక్రమణలు

# తొలగించాలి





- లేకుంటే ఫిబ్రవరి 1 నుండి దీక్షలు
- పోలవరం ప్రాజెక్టు 45.72 ఎత్తులోనే నిర్మించాలి
- ప్రత్యేక హెూదాపై చంద్రబాబు ఎందుకు నోరు మెదపరు...?
- ఫెడరల్ వ్యవస్థకు తూట్లు పొడుస్తూ
- జమిలి ఎన్నికలు తెచ్చి ఆధిపత్యం ...
- చెలాయించేందుకు మోడీ కుట్ర
- సిపిఐ జాతీయ కార్యదర్శి కె.నారాయణ

**ఏలూరు, మేజర్‌న్యూస్:** కొల్లేరును ప్రక్షాళన చేయాలని సిపిఐ జాతీయ కార్యదర్శి కె.నారాయణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.ఏలూరు జిల్లా కార్యాలయం స్ఫూర్తి భవనం నందు శుక్రవారం సాయంత్రం కొల్లేరు పరిరక్షణ సదస్సు సిపిఐ ఏలూరు జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణ చైతన్య అధ్యక్షతన జరిగింది.ముఖ్య అతిధులను వేదిక పైకి సిపిఐ ఏలూరు జిల్లా సహాయ కార్యదర్శి ఉప్పులూరి హేమశంకర్ ఆహ్వానించారు.

ఈ సదస్సులో ముఖ్యఅతిథిగా పాల్గొన్న కె.నారాయణ మాట్లాడుతూ రాష్ట్ర పరిధిలోనే కాకుండా కేంద్ర ప్రభుత్వ పరిధిలో ఉందని,2006 లోనే సుప్రీంకోర్టు కొల్లేరు పరిరక్షణపై తీర్పు ఇచ్చిందన్న

- తరువాయి 2లో..



# ఇసుక అక్రమ రవాణాకు పాల్పడే వారిపై చర్యలు

### వీడియో కాన్ఫరెన్స్లో గనుల శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ

**ఏలూరు,మేజర్‌న్యూస్:** రాష్ట్రంలో ఉచిత ఇసుక అక్రమ రవాణాకు పాల్పడే వారిపై చర్యలు తీసుకోవడం జరుగుతుందని రాష్ట్ర గనుల శాఖ ప్రిన్సిపల్ కార్యదర్శి ముఖేష్ కుమార్ మీనా అన్నారు.శుక్రవారం జూమ్ కాన్ఫరెన్స్ ద్వారా జిల్లా కలెక్టర్లతో ఉచిత ఇసుక విధానంపై సమీక్షించారు. ఈజూమ్ కాన్ఫరెన్స్‌కు ఏలూరు జిల్లా నుండి జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి హాజరయ్యారు.ఈసందర్భంగా ముఖేష్ కుమార్ మీనా మాట్లాడుతూ నదులకు అనుకొనివున్న గ్రామాల్లోని ప్రజల అవసరాలకు ఉచితంగా ఇసుక తీసుకువెళ్లడానికి మండలస్థాయి అధికారి అనుమతులు ఇవ్వాలనిపేర్కొన్నారు. ఇసుక కావాల్సినవారు సంబంధిత గ్రామసచివాలయంలో

- తరువాయి 2లో..

## ప్రజలకు సంతృప్తికరమైన

# సేవలు అందించడమే లక్ష్యం

### ఎంపీ పుట్టా మహేష్ కుమార్ వెల్లడి

**ఏలూరు, మేజర్‌న్యూస్ :** ఏలూరు పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని ప్రజలకు సంతృప్తికరమైన సేవలు అందించడమే లక్ష్యంగా తాను పనిచేస్తున్నట్లు ఎంపీ పుట్టా మహేష్ కుమార్ తెలిపారు. ఏలూరు శాంతినగర్ లోని తన క్యాంపు కార్యాలయంలో ఎంపీ మహేష్ కుమార్ శుక్రవారం ప్రజా దర్బార్ నిర్వహించారు. పార్లమెంట్ నియోజకవర్గం నలుమూలల నుంచి తరలివచ్చిన

- తరువాయి 2లో..



# కొల్లేరు,ఆక్వా సమస్యలపై చర్చ

### డిప్యూటీ స్పీకర్ రఘురామను సత్కరించిన కేంద్రమంత్రి వర్మ, ఎమ్మెల్యేలు డాక్టర్ కామినేని,చింతమనేని, ధర్మరాజు



**విజయవాడ/కైకలూరు,మేజర్‌న్యూస్:** విజయవాడలో శాసనసభ్యులు డా.కామినేని శ్రీనివాస్ నివాసం వద్ద కొల్లేరు ఆక్వారైతుల పలుసమస్యలపై చర్చించిన నర్సాపురంపార్లమెంట్‌సభ్యులు,కేంద్రభారీ పరిశ్రమలు, ఉక్కు శాఖ సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ, శాసన సభ్యులు డా.కామినేని శ్రీనివాస్, ఉంగుటూరు శాసనసభ్యులు

- తరువాయి 2లో..

# త్రాగు,సాగు నీటికీ ఇబ్బందులు లేకుండా

# ముందస్తు ప్రణాళికలు

### సిద్ధం చేసుకుని సమర్ధవంతంగా జిల్లాలో అమలు చేయాలి..
### దాళ్వా పంటకు ప్రతి ఎకరాకు పుష్కలంగా సాగునీరు అందించాలి

**భీమవరం,మేజర్‌న్యూస్:** జిల్లా కలెక్టరేటు వశిష్ట కాన్ఫరెన్స్ హాల్లో శుక్రవారం నీటిపారుదల సలహా మండలి సమావేశం జిల్లాకలెక్టరు చదలవాడ నాగరాణి అధ్యక్షతన జరిగింది. జిల్లా జాయింటు కలెక్టరు టి.రాహుల్ కుమార్‌రెడ్డి, సంబంధిత అధికారులు,సలహామండలి సభ్యులుతో జిల్లా కలెక్టరు చదలవాడ నాగరాణి సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా జిల్లా కలెక్టరు మాట్లాడుతూ మూడు సార్లు వరదలు, మూడు సార్లు తుఫాన్‌లు వచ్చాయని రైతులు చాలా ఇబ్బందులు పడ్డారని, సంబంధిత ఇరిగేషన్ పనులపై దృష్టి సారించాలన్నారు. జిల్లాలోనీ 20 మండలాల్లో 9ప్రధాన కాలువలు ద్వారా 4,03,001 ఎకరాల ఆయకట్టుకు నీటిసరఫరా జరుగుతుందన్నారు.రబీపంటకు సాగునీరు కొరత లేకుండా ముందస్తు ప్రణాళికలు రూపొందిం చుకుని పక్కాగా అమలు చేయాలన్నారు. డిసెంబరు 31వ తేదీలోగా జిల్లాలో అన్ని చెరువులు, ఓహెచ్‌ఎస్‌ఆర్ ట్యాంకులు పూర్తిస్థాయిలో నింపుకునేలా చర్యలు



చేపట్టాలన్నారు. అలాగే చేపలు, రొయ్యలు చెరువులు పూర్తిగా నీరునింపుకునుటకుచర్యలు తీసుకోవాలన్నారు. ఆ తరువాత ఆక్వా సాగుకు చెరువులు నీరు నింపుకునే అవకాశం ఉండదని స్పష్టంగా ఆయా రైతులకు తెలియజేయాలన్నారు. ఏప్రిల్ 15 వ తేదీన కాలువలు మూసి వేయడం జరుగుతుందని, తిరిగి జూన్ 1వ తేదీన కాలుల్లోకి నీరు వదులుతారని, పూర్తి స్థాయిలో కాలువలోకి నీరు రావడానికి మరో పది రోజు సమయం

- తరువాయి 2లో..

# చింతలపూడి ఎత్తిపోతల పథకం భూ నిర్వాసిత రైతులకు కొత్త నోటిఫికేషన్ ద్వారా పరిహారం

## చెల్లించకపోతే ఉద్యమం: భూ నిర్వాసిత రైతుల సమావేశం నిర్ణయం




**చింతలపూడి,మేజర్‌న్యూస్:** చింతలపూడిలో శుక్రవారం గురుభట్ల గూడెం రోడ్డులో చిట్లూరి అంజి బాబు ఇంటి వద్ద చింతలపూడి ఎత్తిపోతల పథకం భూ నిర్వాసిత రైతుల సమావేశం చిట్లూరి అంజిబాబు అధ్యక్షతన నిర్వహించారు.ఈ సమావేశంలో ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్ మాట్లాడుతూ 2015,2016 లలో భూసేకరణ నోటిఫికేషన్ ద్వారా తక్కువ పరిహారం రావడంతో అప్పటి నుండి చింతలపూడి ఎత్తిపోతల పథకం భూ నిర్వాసిత రైతులు న్యాయమైన పరిహారం కోసం పోరాటం చేస్తున్నారని గుర్తు చేశారు.ఈ కాలంలో భూములు విలువ మరింత పెరిగిందని చెప్పారు. గత 7,8 సంవత్సరాలుగా భూ నిర్వాసిత రైతులకు న్యాయం జరగకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.రెవిన్యూ అధికారులు ఈ భూములను బ్లాక్ లిస్టులో పెట్టడంతో పంట రుణాలు, పంట నష్ట పరిహారాలు రైతులు పొందలేకపోయారని, చివరకు కుటుంబ అవసరాలు, పిల్లల పెళ్లిళ్లు నిమిత్తం భూములు అమ్ముకోవడానికి అవకాశం లేక అవస్థలు పడ్డారని చెప్పారు. ప్రభుత్వం నిధులు కేటాయించడంతో 2016లో ఇవ్వాల్సిన పరిహారం ఇప్పుడు చెల్లిస్తున్నామని అందుకు రైతులు అంగీకరిస్తున్నట్లు అధికారులు రైతులను అంగీకార పత్రాలపై సంతకాలు కోరడం అన్యాయమన్నారు. రైతులను మభ్యపెట్టి మాయ చేసి ప్రభుత్వమే మోసగించే చర్యలు చేపట్టడం దుర్మార్గమన్నారు. చెట్లు,షెడ్లు, బోర్లు పరిహారం కూడా చాలా తక్కువగా నిర్ణయించారని వివరించారు. ఇప్పటికైనా రైతులతో చర్చలు జరిపి కొత్త నోటిఫికేషన్ ద్వారా న్యాయమైన పరిహారం ఇచ్చి ఆదుకోవాలని కోరారు.ఇంకా ఈ సమావేశంలో వనమాల కృష్ణారావు,చిట్లూరి వెంకటరమణ,చిట్లూరి హనుమంతరావు,కొనకళ్ళ నాగేశ్వరరావు,గారపాటి లక్ష్మణరావు తదితరులు మరియు వివిధ గ్రామాల రైతులు పాల్గొన్నారు.

# దేశ ప్రగతిలో సహకార సంఘాల ప్రధాన పాత్ర




**ఏలూరు, మేజర్‌న్యూస్ :** దేశ ప్రగతిలో సహకార సంఘాల ప్రధాన పాత్ర పోషిస్తున్నాయని జిల్లా సహకార అధికారి ఏ శ్రీనివాస్ అఖిలభారత సహకార వారోత్సవాల సందర్భంగా జిల్లా సహకార మార్కెటింగ్ సొసైటీ ఆవరణలో శుక్రవారం జిల్లా సహకార అధికారి ఏ శ్రీనివాస్ సహకార పతాకాన్ని ఆవిష్కరించారు.ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ సహకార సంఘాలు లాభాపేక్ష లేకుండా ప్రజలకు సేవలందిస్తున్నాయన్నారు. రైతులకు రుణాలు అందించడం, ఎరువులు, విత్తనాలు నుండి పండిన ధాన్యాన్ని కొనుగోలు చేయడం వంటి ఎన్నో సేవలందిస్తున్నాయన్నారు. ఏలూరు జిల్లాలో డిసిఎంఎస్ ద్వారా రైతులకు, వినియోగదారులకు నాణ్యమైన వస్తువులను తక్కువ ధరలకే అందిస్తున్నార న్నారు. వికసిత్‌భారత్ నిర్మాణములో సహకార సంఘాల పాత్ర గురించి తెలుపుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు సహకార రంగ సంస్కరణల గురించి విపులముగా వివరించారు.ఉన్నతమైన వ్యవస్థగా రూపుదిద్దుకొనుటకు సిబ్బందిపనిచేయాలని కోరారు. సహకార వారోత్సవాలు ఇన్చార్జి ఆర్ శ్రీనివాసరావు మాట్లాడుతూ సహకార వారోత్సవాల ప్రాముఖ్యత గురించి రోజువారి అంశముల గురించి రాబోవు రోజుల్లో గవర్నమెంట్ ఎలక్ట్రానిక్ మార్కెటింగ్ ద్వారా విస్తృతమైన సేవలు అందించుటకు సహకార సంఘాలకు అవకాశము వచ్చిందన్నారు.బిజినెస్ మేనేజర్ కృష్ణ మోహన్ మాట్లాడుతూ తమ మార్కెటింగ్ సంస్థ ద్వారా చేయుచున్న వ్యాపారాల లావాదేవీలు సంఘ ప్రగతి గురించి తెలిపి ఉన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా సహకార అధికారులు ఎం నరసింహారాజు గారు సీనియర్ అసిస్టెంట్ సుధాకర్ ఏకెఎన్‌మూర్తి, మార్కెటింగ్ సొసైటీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# కొల్లేరులో ఆక్రమణలు తొలగించాలి

మొదటిపేజి తరువాయి

విషయాన్ని గుర్తు చేశారు. సుప్రీంకోర్టు ఆదేశాలను అమలు చేయకుండా దిక్కరించడం వలన కోర్టు ధిక్కరణ ప్రకారం నోటీసులు జారీ చేసిందన్నారు. బుడమేరు ముఖద్వారం నుండి ఉప్పుటేరు వరకు పూర్తిగా కాలువలు పూడుకుపోయాయని,ఈ కారణంగానే నీటిపారుదల సౌకర్యం లేక వరదలు వచ్చినప్పుడు లంక గ్రామాలు నింపునకు గురవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణం ప్రభుత్వం పూడిక తీసి, అక్రమంగా సాగు చేస్తున్న చేపల చెరువుల ఆక్రమణలు తొలగించి కొల్లేరును పరిరక్షించాలని డిమాండ్ చేశారు.కొల్లేరు పరిరక్షణకు ప్రభుత్వం కట్టుబడి పరిష్కారం చేయని పక్షంలో ఫిబ్రవరి ఒకటో తేదీ నుండి దీక్షలు చేస్తామని హెచ్చరించారు. కేంద్రంలో రాష్ట్రంలో ఎన్డీఏ ప్రభుత్వం పాలనలో ఉందని ప్రజా సమస్యలు ఎందుకు పరిష్కరించడం లేదని ప్రశ్నించారు. రాష్ట్రంలో రహదారులు అధ్వాన్నంగా ఉన్నాయని, ముఖ్యంగా బిజెపి శాసనసభ్యులు ప్రాతినిధ్యం వహిస్తున్న కైకలూరు శాసనసభ్యులు కామినేని శ్రీనివాస్ నియోజకవర్గంలో వాహన చోద కులు తీవ్ర గాయాల పాలై అనారోగ్యం బారిన పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు.కొల్లేరు ప్రజలు చేపలు పట్టుకుని అమ్ముకోవాలంటే సరైనరవాణాసౌకర్యాలు లేవని తెలిపారు.రాష్ట్ర ప్రభుత్వం తక్షణం రహదారులనునిర్మించాలని డిమాండ్ చేశారు.కేంద్రం లో బిజెపి ప్రభుత్వం కామన్ సివిల్ కోడ్ పేరుతో మతతత్వాన్ని రెచ్చగొట్టి లౌకిక తత్వానికి తూట్లు పొడుస్తుందని ఆగ్రహం వ్యక్తం చేశారు.దేశంలో కుల గణన జరిగితే గుత్తాధిపత్యం వహించే వ్యవస్థ మొత్తం బద్దలవుతుందని ఈ కారణంగా బిజెపి కుల గణనను వ్యతిరేకిస్తుంద న్నారు.కుల గణనను సిపిఐ సమర్ధిస్తుందన్నారు.ఒకే ఓటు,ఒకే ఎన్నిక, ఒకే నాయకుడు మోడీ అనే నినాదంతో జమిలి ఎన్నికలు తేవాలని కుయుక్తులు పన్నుతున్నారని విమర్శించారు. జమిలి ఎన్నికలు తెచ్చి తానే ఆధిపత్యం వహించాలని మోడీ ఉవ్విళ్ళూరు తున్నారని ఎద్దేవా చేశారు. ఫెడరల్ వ్యవస్థను విచ్ఛిన్నం చేయాలని చూస్తున్నారని ఆరోపించారు. దేశంలో కార్పొరేట్ వ్యవస్థలు పెరుగుతున్నాయని, సంపన్నులు కట్టే పన్నులకు 33 శాతం నుండి22 శాతం వరకు తగ్గించి,పేదలపై 5 శాతం నుండి18 శాతం వరకు పనులు వేసి కార్పొరేట్ శక్తులకు ఊడిగం చేస్తున్నారని విమర్శించారు. బిజెపికి అనుకూలంగా ఉండే ప్రభుత్వాలను అందలం ఎక్కించి,వ్యతిరేకంగా ఉండే వారిని రాజకీయంగా బ్లాక్ మెయిల్ చేస్తున్నారని మండిపడ్డారు. అమిత్ షా లాంటి క్రిమినల్ రాజకీయాల్లో హెూంమంత్రిగా ఉండటం వల్ల దేశంలో నేరాలు పెరుగుతున్నాయన్నారు. రాష్ట్రంలో ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రత్యేక హెూదాపై ఎందుకు నోరు మెదపడం లేదని ప్రశ్నించారు.తెలుగు ప్రజల జీవనాడి పోలవరం ప్రాజెక్టును 45.72 ఎత్తులోనే నిర్మాణం చేపట్టాలని డిమాండ్ చేశారు.పోలవరం ప్రాజెక్టు ఎత్తు తగ్గిస్తే రిజర్వాయిగా మారే ప్రమాదం ఉందని,విద్యుత్తు ఉత్పత్తిలో ఆటకం ఏర్పడుతుందన్నారు.విశాఖలో గత ప్రభుత్వ హయాంలో నిర్మించిన ఋషికొండ కట్టడాలను పర్యాటకానికి ఉపయోగించుకుని తద్వారా ఆదాయం పొందవచ్చు అని సూచించారు. సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు డేగా ప్రభాకర్ మాట్లాడుతూ గతంలో కొల్లేరు సరస్సు సహజ సిద్ధంగా ఉండి, స్వచ్ఛమైన తాగునీరు అందుబాటులో ఉండేది అన్నారు. గతంలో పదో కాంటూర్ వరకు 2.25 లక్షల ఎకరాలు ఉంటే నేడు అయిదవ కాంటూర్ వరకు వరకు 77 వేల ఎకరాలు మాత్రమే ఉందన్నారు.భూ మాఫియా ఆక్రమణల కారణంగా వేలాది ఎకరాలు అన్యాక్రాంతం అయ్యాయని విమర్శించారు. 134 సొసైటీల పేరుతో ఉన్న భూములను బీహార్, మాఫియా, అర్ధవరం రాజు, దేవినేని బాజీ వేలాది ఎకరాలు అక్రమంగా చేపల చెరువులు తవ్వి,ప్రైవేటు సైన్యాన్ని కాపలా ఉంచి భయభ్రాంతులకు గురి చేస్తున్నారని ఆరోపించారు.5వ వరకు ఉండే విధంగా,కొల్లేరు పర్యావరణ పరిరక్షణ కోసం సిపిఐ మాత్రమే పోరాడుతుందన్నారు.కొల్లేరును పరిరక్షించే బాధ్యత సిపిఐ తీసుకుంటుందన్నారు.నాటినుండి నేటి వరకు కొల్లేరు పరిరక్షణ కోసం సిపిఐ అనేక పోరాటాలు చేసిన విషయాన్ని గుర్తు చేశారు. సదస్సుకు అధ్యక్షత వహించిన సిపిఐ ఏలూరు జిల్లా కార్యదర్శి కృష్ణ చైతన్య మాట్లాడుతూ లంక గ్రామాల సమస్యలను పరిష్కరించడానికి ఉద్యమాలు చేయడానికి సిద్ధంగా ఉన్నామని తెలిపారు. కొల్లేరులో దోపిడీదారులు దోచుకుంటుంటే పేదలు నష్టాల పాలవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.పోలవరం ప్రాజెక్టును పూర్తిచేసి, నిర్వాసితులకు పూర్తి నష్టపరిహారంతో పాటు,మౌలిక సదుపాయాలు కల్పించాలని డిమాండ్ చేశారు.దీనిపై డిసెంబరులో సదస్సులు నిర్వహిస్తున్నామని తెలిపారు. డిసెంబర్ 26వ తేదీ నుండి సిపిఐ శత జయంతి ఉత్సవాలు ప్రారంభం అవుతున్నాయని వాడవాడల జయంతిఉత్సవాలు ఘనంగా నిర్వహించాలని పిలుపునిచ్చారు.సిపిఐ రాష్ట్ర కంట్రోల్ కమిషన్ కార్యదర్శి బండి వెంకటేశ్వరరావు వందన సమర్పణ చేశారు. ఈ సదస్సులు జిల్లా కార్యవర్గ సభ్యులు,ప్రజా సంఘాల బాధ్యులు, విశ్రాంత ఉద్యోగులు పాల్గొన్నారు.

## కాలం చెల్లిన తినుబండారాలు అమ్ముతున్న యజమానులపై కేసులు నమోదు

మొదటిపేజి తరువాయి

యల్‌బి చర్ల విఆర్‌ఓ సూర్య నారాయణ పాల్గొన్నారు.ప్రజలు ఇలాంటి తినుబండారాలు కొనేముందు వాటికి(కాలం చెల్లింది ఉన్నది)అనే తేదీ చూసుకున్న తరువాత మాత్రమే వినియోగ దారులు వాటిని కొని వినియోగించుకోవాలని నరసాపురం తాసిల్దార్ టీ.రాజరాజేశ్వరి తెలిపారు.

## ఇసుక అక్రమ రవాణాకు పాల్పడే వారిపై చర్యలు

మొదటిపేజి తరువాయి

ముందస్తుగా రిజిస్ట్రేషన్ చేసుకోవా లన్నారు.ఈ ప్రక్రియ పక్కాగా ఉండాలని, నిబంధనలు ఉల్లంఘునకు గురికాకుండా నిఘా పెంచాలన్నారు.నవంబరు 19వ తేదీన మరుగుదొడ్ల దినోత్సవం నేపద్యంలో ఆరోజునుంచి డిశంబరు 10వ తేదీ వరకు మరుగు దొడ్లు, పరిశుభ్రతపై ప్రజల్లో విస్తృతమైన అవగాహన కల్పించాలన్నారు.వ్యక్తిగత మరుగుదొడ్లను పరిశుభ్రంగా ఉంచుకొనివారినిగ్రామపంచాయితీస్థాయిలోగుర్తించి బహుమతు లను ప్రకటించాలన్నారు.సమావేశంలో జిల్లాపంచాయితీ అధికారి కె.అనురాధ, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్‌ఇ త్రినాథ్‌బాబు పాల్గొన్నారు.

## ప్రజలకు సంతృప్తికరమైన సేవలు అందించడమే లక్ష్యం

మొదటిపేజి తరువాయి

ప్రజలు నుండి అర్జీలు స్వీకరించారు. తనకు చట్టసభలో అడుగుపెట్టే అవకాశం కల్పించిన పార్లమెంట్ నియోజకవర్గ ప్రజల నమ్మకాన్ని వమ్ము చేయకుండా ప్రజా సమస్యల పరిష్కారం, అభివృద్దే ధ్యేయంగా నిరంతరం శ్రమిస్తున్నట్లు ఎంపీ స్పష్టం చేశారు. పార్లమెంట్ పరిధిలోని ప్రతి మండలంలో నెలకొన్న సమస్యలతో కూడిన జాబితా సిద్ధం చేశామని, ప్రాధాన్యత క్రమంలో వాటి పరిష్కారానికి కృషి చేస్తున్నట్లు ఎంపీ వెల్లడించారు. కార్యక్రమంలో కూటమి నాయకులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## కొల్లేరు, ఆక్వా సమస్యలపై చర్చ

మొదటిపేజి తరువాయి

పత్సమట్ల ధర్మరాజు,దెందులూరు శాసనసభ్యులు చింతమనేని ప్రభాకర్ కలసి చర్చించినారు.ఈ సందర్భంగా నూతనంగా అసెంబ్లీ ఉపసభాపతిగా ఎన్నికైన రఘురామ కృష్ణమరాజుని సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు.ఈకార్యక్రమంలో ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర చేపల రైతుల సంఘం అధ్యక్షులు నంబూరివెంకటరామరాజు (తాడినాడ బాబు),సభ్యులుముదునూరిసీతారామరాజు,జంపన రామలింగరాజు, గాదిరాజు భాస్కరరాజు,చేపలచెరువుల రైతులు పాల్గొన్నారు.

## త్రాగు,సాగు నీటికీ ఇబ్బందులు లేకుండా ముందస్తు ప్రణాళికలు

మొదటిపేజి తరువాయి

పడుతుందన్నారు. దీనిని దృష్టిలో వుంచుకొని త్రాగునీరు, సాగునీరు కొరతరాకుండా తగుచర్యలు చేపట్టాలని అధికారులకు జిల్లా కలెక్టరు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. రబీ పంటకు కొంత మేర నీటి లభ్యత తక్కువగా ఉన్నందున నీటిని పొదుపు చర్యలను పాటించి డ్రైన్స్‌పై అడ్డుకట్టలు వేయడం, ఆయిల్ ఇంజిన్లు ఏర్పాటు చేయడం, వంతులవారి విధానం అమలు పరచుట ద్వారా అధిగమించి ప్రతి ఏకరాకు సాగునీరు అందించాలన్నారు.కాలువలు, డ్రైన్లలో ఎప్పటికప్పుడు చెత్త చెదారాన్ని తొలగించాలని నీటి ప్రవాహం బాగున్నప్పుడే పంట పొలాలకు సమృద్ధిగా సాగునీరు అందుతుందని అన్నారు. కాలువలు మూసివేయు సమయంలో చేపట్టవలసిన మరమత్తు పనులను పూర్తిస్థాయి నివేదికలను సిద్ధం చేయాలని అన్నారు. గ్రామాల్లో పంటబోదులు, మైనర్ డ్రైన్లు, పుంత రోడ్లు, తదితర పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించి వారం రోజుల్లో పూర్తి స్థాయి నివేదిక ఇవ్వాలన్నారు. ఈ పనులన్ని జాతీయ ఉపాధి హామీ పథకం ద్వారాచేపట్టిపూర్తి చేసినట్లయితే రైతులకు మేలు జరుగుతాయని జిల్లా కలెక్టరు చదలవాడ నాగరాణి అన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా జాయింటు కలెక్టరు టి.రాహుల్ కుమార్ రెడ్డి, జిల్లా రెవిన్యూ అధికారి యం.వెంకటేశ్వర్లు, ఆర్డీవోలు కె.ప్రవీణ్ కుమార్ రెడ్డి, దాసిరాజు, ఖతీబ్ కౌసర్ భానో, జిల్లా నీటిపారుదల శాఖ అధికారి పి.నాగార్జున రావు, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి జెడ్.వెంకటేశ్వర రావు,విద్యుత్తు శాఖ యస్‌ఇ ఏ.రఘునాథ బాబు,జిల్లా ఆర్డబ్ల్యూయస్ అధికారి బి.వి.వి నాగేశ్వర రావు, జిల్లా డ్రైనేజీ అధికారి పి. సుబ్రహ్మణ్యేశ్వర రావు,మత్స్య శాఖ అధికారి కె.వివేక్, నీటిపారుదల శాఖ, డ్రైనేజీ, పురపాలక సంఘం ఇంజనీర్లు, వ్యవసాయ శాఖ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# ప్రజలకు చేరువగా పాలనా నిర్ణయాలు ఉండాలి

## ప్రొబేషనరీ సివిల్ సర్వీస్ శిక్షణ అధికారులకు జిల్లా కలెక్టర్ సూచన



**భీమవరం, మేజర్ న్యూస్:**ప్రజలకు చేరువుగా పాలన నిర్ణయాలు అమలు చేసినప్పుడే ఒక ప్రత్యేక స్థానం పొందగలమని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి ప్రొబిషనరీ సివిల్ సర్వీస్ శిక్షణా అధికారులకు సూచించారు. శుక్రవారం స్థానిక కలెక్టరేట్ ఛాంబర్ నందు జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి ని పదిమంది ప్రొబిషనరీ సివిల్ సర్వీస్ శిక్షణా అధికారులు కలిసి జిల్లాలో గత ఐదు రోజులుగా వారు క్షేత్రస్థాయిలో పరిశీలించిన, అవగాహన చేసుకున్న అంశాలను జిల్లా కలెక్టర్ కు వివరించడం జరిగింది. సివిల్ సర్వీసెస్‌కు ఎంపికై ముస్సోరి లోని లాల్ బహుదూర్ శాస్త్రి నేషనల్ అకాడమీ ఆఫ్ అడ్మినిస్ట్రేషన్ లో శిక్షణ పొందుతున్న 99వ బ్యాచ్ ప్రొబిషినరీ అధికారులు శిక్షణలో భాగంగా పశ్చిమగోదావరి జిల్లాకు "ఫీల్డ్ స్టడీ అండ్ రీసెర్చ్ ప్రోగ్రాం" నిమిత్తం ఈనెల తొమ్మిదో తేదీన జిల్లాకు రావడం జరిగింది. వీరు జిల్లాలో పలు క్షేత్రస్థాయి పర్యటనలు చేసి వివిధ శాఖల ద్వారా అట్టడుగు వర్గాల ఆర్థిక అభివృద్ధికి చేపట్టిన కార్యక్రమాలు, ఎస్ హెచ్ జి లకు బ్యాంకు లింకేజీ అమలు, ఎస్టిపిల నిర్వహణ, విద్య పథకాలు, వైద్యం తదితర అంశాలపై డి ఆర్ డి ఏ, రెవెన్యూ, ఇంజనీరింగ్, ప్రజారోగ్యం, టౌన్ ప్లానింగ్, మెప్మా శాఖలు సంబంధిత అధికారుల విధులపై వారికి అవగాహన కల్పించారు. ఏడాదికి ఎంత ఆదాయం వస్తుంది. ఎలా నిర్వహణ చేస్తారు, ఎలా బడ్జెట్ కేటాయిస్తారు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుండి వచ్చే గ్రాంట్స్ ఏవిధంగా వినియోగిస్తారు, పేదలకు ప్రభుత్వం అందించే పథకాలు తదితరవాటిపై అవగాహన కల్పించడం జరిగింది.

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి మాట్లాడుతూ జిల్లాలో ప్రధానంగా వ్యవసాయం, ఆక్వా కల్చర్ సాగు చేయడం జరుగుతుందని తెలిపారు. జిల్లాలో అమలు చేస్తున్న వివిధ సంక్షేమ పథకాలను వివరించారు. మీరందరూ దేశంలోని వివిధ ప్రాంతాలలో విధులు నిర్వహించేందుకు నియమించబడతారని, సమాజంలోని అన్ని వర్గాల ప్రజల అభ్యున్నతికి క్షేత్రస్థాయిలో అవగాహన చేసుకుని ఉత్తమ సర్వీస్ లను అందజేయాలని ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ వారికి తెలియజేస్తూ అభినందనలు తెలిపారు. ఈ సందర్భంలో జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి, ట్రైనీ సివిల్ సర్వీసెస్ అధికారులు కాత్యాని సింగ్, రూపాలి సున, భగత్ షమల్ కళ్యాణ్ రావు, నౌషీన్, శ్రీకృష్ణ శ్రీరామ సుహెర్, యాష్ చంద్ర ప్రకాష్ సింఘాల్, లక్ష్మణ్ ఆనంద్, సుశాంత్ కుమార్, రాజేష్ కుమార్, అనికెట్ శాండిల్య, భీమవరం ఆర్డీవో కె.ప్రవీణ్ కుమార్ రెడ్డి ఉన్నారు.

## పేదవాడికి పట్టాడు అన్నం పెట్టడమే లక్ష్యం: కూటమి



కైకలూరు, మేజర్‌న్యూస్: చంద్రబాబు నాయుడు, పవన్ కళ్యాణ్ పదవి బాధ్యతలు స్వీకరించిన రోజు నుండి శాసనసభ్యులు డాక్టర్ కామినేని శ్రీనివాస్ ఆదేశాలు మేరకు డొక్కా సీతమ్మ స్ఫూర్తితో నిర్వహిస్తున్న అన్న క్యాంటీన్ 150 రోజుకు చేరింది. అన్నదాతగా గాదం.శెట్టి కృష్ణ, భార్గవ్ సాయి వెల్డింగ్ వర్క్ గుమ్మడి కృష్ణారావు వారిచే అన్నదాన కార్యక్రమం నిర్వహించి నారు. వారి సహాయంతో సుమారు 400 మందికి అన్నదానం చేయడం జరిగింది. ఈ సందర్భంగా జనసేన నాయకులు కొల్లి వరప్రసాద్ (బాబీ) తెలుగు యువత రాష్ట్ర కార్యదర్శి పులా రామచంద్ర రావు(రాజి). మాట్లాడుతూదాతల సహాయంతో నిర్వహిస్తున్న అన్నా క్యాంటీన్ 150 రోజుకు చేరుకోవడం చాల ఆనందంగా ఉందని దాతలు మరొక్కసారి అభినందిస్తున్నామని అన్నారు. ప్రభుత్వం అన్నా క్యాంటీన్‌ను అధికారికంగా ప్రారంభిం చేంతవరకు ఇలాగే కొనసాగిస్తామని తెలిపారు. కార్యక్రమానికి , కైకలూరు జనసేన నాయకులు, తులసి పూర్ణచంద్రరావు( పూర్ణ) బొక్కా వెంకట్రావు ,పుప్పాల సూర్య ప్రకాష్ ,తదితరులు ఎన్డీఏ నాయకులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## కార్తీక పౌర్ణమితో దేవాలయాల్లో ప్రత్యేక పూజలు





**తాడేపల్లిగూడెం, మేజర్ న్యూస్:** ఏలూరు రోడ్ లోని శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి పంచాయతన క్షేత్రంలో వాసవి మాతకు సత్యనారాయణ శర్మ అర్చకత్వంలో వాసవి మాతకు పంచామృత సుగంధద్రవ్యాలతో అబి ,షేకాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి నున్న సుందర్రావు, పేరూరి కాశయ్య ఆలపాటి సత్యనారాయణ పలువర ప్రత్యేక పూజలు నిర్వహించారు.

సాయంత్రం పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని జ్వాలాతోరణం వెలిగించారు. జువ్వలపాలెం రహదారిలోని లలితా దేవి ఆలయంలో కార్తీక పౌర్ణమి సందర్భంగా హైదరాబాదు వాస్తవ్యులు కంబాల సీతారామ్, సంధ్యా దంపతులు ఉత్సవ మూర్తికి పంచామృతాలతో అభిషేకం చేశారు. గ్రామదేవత బలుసులమ్మకు శ్రీరంగం అంజి నేతృత్వంలో బలుసులమ్మ అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. పట్టణంలోని ప్రధాన ఆలయాలన్నీ భక్తులతో కిటకిటలాడుతున్నాయి.

## పోసానిపై ద్వారకాతిరుమల పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు



ద్వారకతిరుమల,మేజర్‌న్యూస్: తిరుమల తిరుపతి దేవస్థానం చైర్మన్ బిఆర్ నాయుడు పై అనుచిత వ్యాఖ్యలు చేసిన సినీ నటుడు పోసాని మురళీకృష్ణ పై స్థానిక పోలీస్ స్టేషన్లో శుక్రవారం ఉదయం తెలుగుదేశం పార్టీ నాయకులు ఫిర్యాదు చేశారు. ఈ క్రమంలో మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు లంక సత్యనారాయణ, యిమ్మడి రత్నాజీ, మట్టపర్తి రూపేష్ కుమార్,పాకలపాటి శ్రీను, పోతూరి సహృదయ, మిడతా రామకృష్ణ, బిజెపి నాయకులు మెట్టపల్లి మాణిక్యాలరావు, జనసేన గ్రామ అధ్యక్షులు అంజిబాబు, తదితరులు వున్నారు.

## కార్తీక పౌర్ణమి రోజు వింత ఘటన



ద్వారకాతిరుమల,మేజర్‌న్యూస్: కార్తీక పౌర్ణమి రోజున గ్రామంలో శేషాచల కొండపై శివాలయం సమీపంలో అటుగా వెళుతున్న పాత్రికేయులకు రెండు పొడ పాములు కలిసి సయాటలాడుతాం కెమెరాకు చిక్కింది. సర్వసాధారణంగా త్రాసు పాములు కలిసి సయాటలాడుతాం చూస్తూ ఉంటాం కానీ ఇక్కడ పొడపాములు సయ్యాటలాడటం చూసి స్థానికులు ఆశ్చర్యానికి గురయ్యారు.

## పాత్రికేయులు యద్దనపూడిని స్ఫూర్తిగా తీసుకోవాలి



**తాడేపల్లిగూడెం,మేజర్‌న్యూస్:** సుప్రసిద్ధ పాత్రికేయులు, సంఘ సంస్కర్త, యద్దనపూడి సూర్యనారాయణమూర్తి స్ఫూర్తితో పాత్రికేయులు పని చేయాలని పలువురు పేర్కొన్నారు. స్థానిక శాఖా గ్రంథాలయంలో యద్దనపూడి 96 జయంతి సభ జరిగింది. పాత్రికేయులు గొలిమే బుజ్జి బాబు (ప్రింట్ మీడియా), దేవ శివ (ఎలక్ట్రానిక్ మీడియా)లును ఈ సందర్భంగా సత్కరించారు. ఈ సందర్భంగా జరిగిన సభకు ది జర్నలిస్ట్ వెల్ఫేర్ అసోసియేషన్ తాడేపల్లిగూడెం ప్రెస్ క్లబ్ ప్రెసిడెంట్ తమ్మిశెట్టి రంగ సురేష్ అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయాధికారి వి శ్రీనివాసరావు, ఎల్. ఐ. సి. ఉద్యోగుల సంఘ నాయకులు గరికిపాటి బాపయ్య శర్మ, సీనియర్ జర్నలిస్ట్ ఖాదర్ మోహిద్దీన్, ఏపియూడబ్ల్యూ జె జిల్లా కారదర్శి గజపతి ప్రసాద్, ప్రెస్ క్లబ్ పూర్వాధ్యక్షులు చిక్కాల రామకృష్ణ, పూర్వ కార్యదర్శి యద్దనపూడి సుబ్బారావు, జర్నలిస్ట్ ఆకుల దుర్గా ప్రసాద్ తదితరులు మాట్లాడారు. ముందుగా తాలూకా ఆఫీస్ సెంటర్‌లో యద్దనపూడి విగ్రహానికి జనసేన నాయకుడు అడబాల నారాయణ మూర్తి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు.

## దివ్యాంగులకు సమాన హక్కులు -సీనియర్ సివిల్ జడ్జి రత్న ప్రసాద్

**ఏలూరు, మేజర్‌న్యూస్:** పరివర్తన్ చెవుటి,మూగ పాఠశాలలో ఘనంగా బాలల దినోత్సవ వేడుకలు స్థానిక ఏలూరు దొండపాడు నందు గలపరివర్తన్ దివ్యాంగుల ప్రత్యేక పాఠశాలలో బాలల దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధులుగా సినియర్ సివిల్ జర్జి కే.రత్నప్రసాద్, విబిన్నప్రతిభావంతుల, వయోవృద్దుల సహాయ సంచాలకులు బి.రామ్‌కుమార్ పాల్గొన్నారు.

కార్యక్రమంలో మొదటగా జవహర్ లాల్ నెహ్రూ చిత్ర పటానికి పూలమాల వేసి జ్యోతి ప్రజ్వలన చేయడం జరిగింది. అనంతరం సినియర్ సివిల్ జడ్జి కే. రత్న ప్రసాద్ మాట్లాడుతూ " బాల బాలికలకు బాలల దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేస్తు జవహర్ లాల్ నెహ్రూ కి బాలల పట్ల అమితమైన ప్రేమ అని,అందువల్లే ఆయన పుట్టినరోజుని బాలల దినోత్సవంగా జరుపుకుంటున్నాము" అని తెలియజేశారు. "2016 ఆర్‌పిడబ్ల్యుడి ఆక్ట్ ప్రకారం సాధారణ పిల్లలతో సమానంగా దివ్యాంగ పిల్లలకు విద్య,ఉద్యోగం హక్కులు వాటిలో పొందుపరిచి దివ్యాంగుల ఉన్నతికి పాటుపడుతుంది. బీఅలాగే చిన్న పిల్లల సహాయార్థం ప్రభుత్వం టోల్ ఫ్రీ నాబర్ 1098 ఏర్పాటు చేసి పిల్లలో కుల మతాలు వాటి విబేదాలు ఉండకుండా అందరు సమానం అని భావనకలిగి వుండాలి.'అని వివరించారు,విజేతలుగా నిలిచిన విభిన్న ప్రతిభావంతుల పిల్లలకు ప్రథమ ద్వితీయ బహుమతులు అందించడం జరిగింది. అనంతరం సహాయ సంచాలకులు బి. రామ్ కుమార్ మాట్లాడుతూ



మీరు కూడా "దివ్యాంగులమనే బావన వీడి కష్టపడి చదివి ఉన్నత శిఖరాలనుఅధిరోహించాలని అన్నారు. చిన్నపాటి లోపాన్ని జయించటానికి ప్రపంచం మొత్తం మీ వెనుకే ఉంటుందనీ అన్నారు .అలాగే పరివర్తన్ సంస్థ పాఠశాలతో పాటు దివ్యాంగులకు వివిధ కార్యక్రమాల ద్వారా సేవలు అందిచడం జరుగుతుందని" ఈ సందర్భమగా యజమాన్యానికి అభినందనలు తెలియజేశారు. అనంతరంపాఠశాలప్రిన్సిపల్ డి.శ్రీనివాస రెడ్డి మాట్లాడుతూ మా సంస్థకు ఏఅవసరం ఉన్న ఆదుకుంటున్నారని, ఈసందర్భంగా వారికి కృతజ్ఞతలు తెలియజేశారు.

# సంచార జాతులను ఎస్టీ జాబితాలో చేర్చాలి

**అన్ని జిల్లాల కలెక్టర్లకు వినతి పత్రాలు ఇవ్వాలి**
**సంచార జాతుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా చల్లా రామయ్య నియామకం**




**విజయవాడ/నర్సాపురం,మేజర్‌న్యూస్ :** స్థానిక ఐలాపురం హోటల్లో శుక్రవారం ఆంధ్రప్రదేశ్ సంచారజాతుల రాష్ట్ర కార్యవర్గ సమావేశం జరిగింది, ఈ సమావేశంలో పలు అంశాలు చర్చించి తీర్మానం చేయడం జరిగింది. ఇందులో ప్రధానంగా 1961 ఆంధ్రప్రదేశ్ ట్రైబల్ విచారణ కమిటీ చైర్మన్ వెన్నెలగంటి రాఘవయ్య ఇచ్చిన కమిటీ రిపోర్ట్ ప్రకారంగా సంచార జాతులను ఎస్టీ జాబితాలో చేర్చాలని తీర్మానించారు. 2008 జాతీయ సంచారజాతుల కమిషన్ చైర్మన్ బాలకృష్ణ రేణుకే ఇచ్చిన రిపోర్టు ప్రకారంగా సంచార జాతులకు 10శాతం విద్య,ఉద్యోగ, రాజకీయ, ఉపాధి రంగాల్లో రిజర్వేషన్ కల్పించాలని ఇచ్చిన రిపోర్టును అమలు చేసే విధంగా పోరాటం చేయాలని, సంఘం తీర్మానం చేసింది. ఈ సమావేశంలో ఆంధ్రప్రదేశ్ సంచార జాతుల సంఘం వ్యవస్థాపక అధ్యక్షులు, ఎంబీసీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ పెండ్ర వీరన్న మాట్లాడుతూ త్వరలో అన్ని జిల్లాల కలెక్టర్లను కలిసి సంచార జాతులను ఎస్టీ జాబితాలో చేర్చాలని వినతి పత్రాలు ఇచ్చి వారి సమస్యల వివరించాలని పిలుపునిచ్చారు. అలాగే త్వరలో అన్ని జిల్లాల్లో జిల్లా మహాసభలను ఏర్పాటు చేయాలని వ్యవస్థాపక అధ్యక్షులు పెండ్ర వీరన్న అన్నారు, అలాగే రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా పనిచేస్తున్న జి. సుధాకర్ ఇటీవల వారి వ్యక్తిగత కారణాలవల్ల పదవికి రాజీనామా చేయడం జరిగింది. ఈ సందర్భంగా, ఇంతవరకు రాష్ట్ర కార్యదర్శిగా పనిచేస్తున్న చల్లా రామయ్య ని రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా ప్రకటించడం జరిగింది. ఈ కార్యక్రమంలో సంచార జాతుల సంఘం రాష్ట్ర అధికార ప్రతినిధి అనపర్తి ఏడుకొండలు, రాష్ట్ర కార్యదర్శి అన్నపురెడ్డి వీర రాఘవులు , ముస్లిం సంచారజాతుల సంఘం నాయకులు షేక్ హేమావలీ , జిల్లా అధ్యక్షులు చుండూరు ముసలయ్య , వనపర్తి భీమన్న , చిన్న ఆంజనేయులు , యువజన విభాగం చిన్న కత్తుల మంగరాజు , పెండ్ర జాన్ మోషే , పాముల కుల సంఘ నాయకులు దాసరి వెంకటేశ్వరరావు , పిచ్చుకుంట్ల కుల సంఘ నాయకులు కత్తి కొండయ్య, మందుల కుల సంఘ నాయకులు పెండ్ర ముసలయ్య, వాడపల్లి నరసన్న,ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# రాష్ట్ర స్థాయి నెట్‌బాల్ పోటీలో విద్యార్థుల ప్రతిభ

**పాలకోడేరు మేజర్ న్యూస్:**గొరగణముడి స్వామి జ్ఞానానంద జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు 68వ రాష్ట్ర స్థాయి నెట్ బాల్ పోటీలో అండర్ 14బాలికలు అండర్ 17బాలురు పశ్చిమ గోదావరి జిల్లా జట్టుకు ప్రాతినిత్యం వహించి ద్వితీయ స్థానం సాధించారని పాఠశాల ఇన్చార్జి హెచ్. ఎమ్ హేమలత తెలిపారు విశాఖపట్నంలో ఈ నెల 8,10 తేదీలలో జరిగిన రాష్ట్ర స్థాయి నెట్ బాల్ బాలబాలికల పోటీలో గొరగణముడి స్వామి జ్ఞానానంద హై స్కూల్ విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు అండర్ 14 నెట్ బాల్ పోటీలో బాలికలు పి. వసుంధర జి. అనుష్య డి. దీపిక టి. మహాలక్ష్మి డి జ్యోత్స్న నాగ సాయి అండర్ 17 బాలురు విభాగంలో కే లోకేష్ ఏ. నిఖిల్ వినయ్ బి. రాజేష్ ఎస్ మహేష్ బాబు ద్వితీయ స్థానం సాధించి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైనట్లు పి డి ఎన్ విజయలక్ష్మి అన్నారు బాలల దినోత్సవం సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా విచ్చేసిన సినీ టివి సీరియల్ నటుడు శ్రీ రామ్ జగన్ గ్రామ సర్పంచ్ గొట్టుముక్కల శివాజీ రాజు పేరెంట్స్ కమిటీ చైర్మన్ పొన్నమండ బాలకృష్ణ కలిదిండి సత్యనారాయణ రాజు ఎమ్‌పిటిసి వేగేశ్న కృష్ణకుమారి విద్యార్థులకు బహుమతులు అందజేసి అభినందించారు



# ఫారం ఫండ్స్‌లో చేపల పెంపకంపై అవగాహన



**ప్రతి రైతు ప్రత్యామ్నాయ ఆదాయం పొందేందుకు కృషి**
**ఐటిసి - బైఫ్ సంస్థ ప్రతినిధులు వెల్లడి**

**జీలుగుమిల్లి, మేజర్ న్యూస్:** ప్రతి రైతు తాను పండించే పంటలతో పాటు అదనపు ఆదాయం పొందేందుకు ఫారం ఫండ్స్‌లో చేపల పెంపకంతో ఆర్థివృద్ధి చేకూరేలా "ఐటీసీ - బైఫ్" సంస్థలు రైతులకు అవగాహన కల్పించి కృషి చేస్తున్నట్లు ఐటిసి బైఫ్‌స్టేట్ హెడ్‌పి పెద్దిరాజు పేర్కొన్నారు. శుక్రవారం జీలుగుమిల్లిలోని వెలుగు కార్యాలయం హాల్ నందు రైతులతో ఫారం ఫండ్‌లో చేపల పెంపకంపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పెద్దిరాజు, కే సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ రైతుకు ఉన్న భూమిలోనే కొద్దిపాటి స్థలంలో ఫారం పండ్స్ తవ్వించి దానిలో మూడు రకాల చేపలను పెంపకం ద్వారా ఆర్థిక వృద్ధి చేకూరుతుందని తెలిపారు. ఫారం ఫండ్స్ ను ఐటిసి సంస్థ ఉచితంగా తవ్విస్తుందని అన్నారు. చేప పిల్లను ఐటిడిఏ సప్లై చేయనున్నట్లు వెల్లడించారు. గతంలో ఈ ప్రాంతంలో కొందరు రైతులకు ఫారం ఫండ్స్ తవ్వించి చేపలు వేయడం జరిగిందని తద్వారా ఆ రైతులు ఆర్థిక స్వావలంతో ముందుకు వెళుతున్నట్లు గుర్తించి ప్రతి రైతు తాను పండించే పంటతో పాటు ప్రత్యామ్నాయంగా చేపలపెంపకం ద్వారా ఆర్థికంగా ఎదగాలని సంకల్పంతో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. అలాగే ప్రతి రైతు తనకున్న పొలం చుట్టూ ఐటిసి అందించే జామాయిల్ క్లోన్స్ నాటుకుంటే మరింత ఆదాయం పొందవచ్చని వెల్లడించారు. ఇప్పటివరకు రైతు తాను పండించిన పంటపై మాత్రమే ఆధారపడేవారని ప్రతియన్మాయంగా ఉన్న పొలంలోనే పలు రకాలుగా ఆదాయం పొందేది ఎలా అనే అంశాన్ని సంబంధిత శాఖ అధికారులు రైతులకు వివరించారు. ఫారం పండ్స్ తవ్వించుకోవాలనే రైతులు తమ ప్రతినిధిని సంప్రదించాలని తెలిపారు. అలాగే రైతులకు ఉన్న పలు అనుమానాలను నివృత్తి చేశారు. ఫారం ఫండ్స్ లో చేపల పెంపకం అనే అంశం చాలా బాగుందని తాము ఈ తరహా పంటను పండించేందుకు సిద్ధమని రైతులు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో బైఫ్ ప్లాంట్ మేనేజర్ వెంకట సురేష్, ఆనంద్, ఏపీవో. నాగరాజు, సేంద్రియ వ్యవసాయం మండల టీం లీడర్ దినేష్ కుమార్, మండల టెక్నీషియన్ శాంతకుమారి, ఎల్ టు నాగలక్ష్మి, రైతులు కుంజా చిన్న రాముడు, బుద్దుల లక్ష్మణరావు,బొంతు రామకృష్ణ, గారపాటి శ్రీనివాస్, పలువురు రైతులు, సేంద్రియ వ్యవసాయ సిబ్బంది, ఐటిసి బైఫ్ అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

## అటవీ ప్రాంతంలో దాచిన బెల్లపు ఊట ధ్వంసం

**నాటు సారా తయారు చేస్తే కేసులు :ఎక్సైజ్ సిఐ శ్రీనుబాబు**



**జీలుగుమిల్లి, మేజర్ న్యూస్:** మండలంలోని కామయ్య పాలెం శివారు అటవీ ప్రాంతంలో నాటుసారా తయారీ కొరకు ఉపయోగించే 700 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేసినట్లు ఎక్సైజ్ శాఖ సిఐ కే శ్రీను బాబు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అక్రమార్గాన నాటు సారా తయారుచేసిన మద్యం నిలువ చేసి విక్రయించిన కేసులు నమోదు చేస్తామని హెచ్చరిం చారు. గ్రామాలలో ఎవరైనా నాటు సారా తయారు చేస్తే తమకు సమాచారం అందించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఈ దాడుల లో సబ్‌ఇన్స్పెక్టర్ ఎస్ఎన్ఎస్ సుబ్రహ్మణ్యం సిబ్బంది పాల్గొన్నారు.

## శ్రీ సీతారామ స్వామిని దర్శించుకున్న

**మాజీ శాసనసభ్యులు డాక్టర్.సిహెచ్. సత్యనారాయణ**



**నర్సాపురంరూరల్,మేజర్‌న్యూస్ :** మండలంలోని కొప్పర్రు గ్రామంలో అతిపురాతనమైన దేవాలయాన్ని పాలకొల్లు మాజీ శాసనసభ్యులు డాక్టర్ సిహెచ్ సత్యనారాయణ మూర్తి శనివారం దర్శించుకున్నారు. సుమారు 200 సంవత్సరముల రామాలయాన్ని దర్శించుకునిప్రత్యేక పూజలు చేశారు. ఆలయ సంప్రదాయకరం ఆయనకు పూజారులు, గ్రామస్తులు స్వాగతించి దర్శనం అనంతరము స్వామివారి శేష వస్త్రములతో సన్మానించారు. ఈ కార్యక్రమంలోసవరపు సత్యనారాయణ,పోలిశెట్టి సీతారామయ్య, చిన మిల్లి వీరబాబు,ముక్కు తాతాజీ,ఆచంట వాసు,రావూరి సురేష్ కుమార్తదితరులు పాల్గొన్నారు.

## క్షీర రామలింగేశ్వర స్వామి నీ దర్శించుకున్న ప్రిన్సిపల్ సెక్రెటరీ వాణిమోహన్



పాలకొల్లు,మేజర్‌న్యూస్: శ్రీ క్షీరా రామలింగేశ్వర స్వామి వారి దేవస్థానం నందు కార్తీక పౌర్ణమి సందర్భంగా స్వామి వారిని ప్రిన్సిపల్ సెక్రటరీ జీ.వాణి మోహన్ దర్శించుకొనియున్నారు. ఆలయ కార్య నిర్వహణ అధికారి ముచ్చర్ల శ్రీనివాస్ స్వాగతం పలికి ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు, పాలకొల్లు తహసిల్దార్ ఎర్ల దుర్గా కిషోర్ తదితరులు పాల్గొన్నారు,

## స్వామి వారి విగ్రహ ప్రతిష్ట మహోత్సవ ఆహ్వానం



**కలిదిండి, మేజర్‌న్యూస్:** రాష్ట్ర రాజధాని అమరావతిలో రాష్ట్ర గనులు భూగర్భ వనరులు ఎక్సైజ్ శాఖ మాత్యులు కొల్లు రవీంద్ర, శాసనసభ్యులు కామినేని శ్రీనివాస్, కాకినాడ సిటీ శాసనసభ్యులు వనమాడి వెంకటేశ్వరరావు (కొండబాబు) నరసాపురం శాసనసభ్యులు ప్రభుత్వ విప్ బొమ్మిడి నాయకర్‌ని కలిదిండి మండలం పెదపుట్లపూడి గ్రామ పెద్దలతో కలిసి పెదపుట్ల పూడిలో ఈనెల 23వ తేదీన శ్రీ ఆంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ట కార్యక్రమానికి రావలసినదిగా ఆహ్వాన పత్రిక అందజేసిన రాష్ట్ర అగ్నికుల క్షత్రియ వెల్ఫేర్ అండ్ దెవలప్మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ గా నియమించిన అంద్రాజు శ్రీనివాసరావు మర్యాదపూర్వకంగా కలిసినారు.

# కార్యకర్తల సంక్షేమానికి కృషి చేస్తున్న ఘనత టీడీపీదే





**ఎంపీ పుట్టా మహేష్ కుమార్ వెల్లడి**

**నిడమర్రు, గణపవరంలో సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని పార్టీ జిల్లా అధ్యక్షుడు గన్ని వీరాంజనేయులుతో కలిసి ప్రారంభించిన ఎంపీ**

**నిడమర్రు/ గణపవరం, మేజర్ న్యూస్ :** దేశంలో ఏ రాజకీయ పార్టీ చేపట్టని విధంగా కార్యకర్తల సంక్షేమానికి పథకాల అమలు చేస్తున్న ఘనత తెలుగుదేశం పార్టీకి దక్కుతుందని ఏలూరు ఎంపీ పుట్టా మహేష్ కుమార్ తెలిపారు. నిడమర్రు, గణపవరంలో తెలుగుదేశం పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని పార్టీ జిల్లా అధ్యక్షుడు గన్ని వీరాంజనేయులుతో కలిసి ఎంపీ శుక్రవారం ప్రారంభించారు. గణపవరంలో నూతనంగా ఏర్పాటు చేసిన తెలుగుదేశం పార్టీ కార్యాలయాన్ని ఎంపీ ప్రారంభించారు. అనంతరం జరిగిన కార్యకర్తలు , నాయకుల ఆత్మీయ సమావేశంలో ఎంపీ మహేష్ కుమార్ మాట్లాడారు. గత వైఎస్ఆర్సిపి ప్రభుత్వంలో జగన్ వైఫల్యాలు కారణంగా రాష్ట్రం 30 ఏళ్ల అభివృద్ధిలో వెనుకబడిపోయిందని ఎంపీ ఆరోపించారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం అధికారులోకి వచ్చిన ఆరు నెలల కాలంలోనే విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ రాష్ట్రంలోని యువతకు ఉద్యోగ అవకాశాలు మెరుగుపరచడం కోసం 4 లక్షల ఉద్యోగాలు కల్పించే పరిశ్రమలు రాబట్టారని తెలిపారు. రాష్ట్ర అభివృద్ధి, నిరుద్యోగ యువతకు ఉద్యోగ, ఉపాధి కల్పనే లక్ష్యంగా తమ ప్రభుత్వం పని చేస్తుందని ఎంపీ పేర్కొన్నారు. తాను ఎంపీగా గెలిచిన నాటి నుంచి ఏలూరు పార్లమెంటు నియోజకవర్గం అభివృద్ధిపై దృష్టి సారించినట్లు వెల్లడించారు. జిల్లా పార్టీ అధ్యక్షుడు గన్ని వీరాంజనేయులుకు అధిష్టానం సముచిత స్థానం కల్పిస్తుందని, త్వరలోనే ఆయనకు మంచి పదవి రాబోతుందని ఎంపీ తెలిపారు. నిడమర్రు, గణపవరం పర్యటన సందర్భంగా పార్టీ శ్రేణులు, నాయకులు ఎంపీ మహేష్ కుమార్‌కు పుష్పగుచ్చాలు అందజేసి శాలువాలు కప్పి సన్మానించారు. కార్యక్రమంలో ఏపీఐఐసీ చైర్మన్ మంతెన రామరాజు, నాయకులు, ప్రజా ప్రతినిధులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# అధిక భారాలు తగ్గించాలని కోరుతూ సిపిఎం ధర్నా

**నర్సాపురం, మేజర్‌న్యూస్ :** కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజల పైన మరింత భారాల మోపుతూ ప్రజలను ఆర్థిక ఇబ్బందులకు గురిచేస్తున్నారని సిపిఎం పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కవురు పెద్దిరాజు, పట్టణ కార్యదర్శి ముచ్చర్ల త్రిమూర్తులు విమర్శించారు. ఈనెల 8 నుండి 14 వరకు ప్రజా పోరు పేరుతో ఇంటింటికి సిపిఎం కార్యకర్తలు వెళ్లి ప్రజా సమస్యలపై కరపత్రాలు పంపిణీ సమస్యలు అధ్యయన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజల నుండి వచ్చిన సమస్యలను ప్రభుత్వం తక్షణం పరిష్కరించాలని స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయం వద్దశుక్రవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా పెద్దిరాజు, త్రిమూర్తులు మాట్లాడుతూ కేంద్రంలోనూ, రాష్ట్రంలోనూ ఉన్న కూటమి ప్రభుత్వం ధరలను అదుపు చేయటంలో విఫలమైందన్నారు. నిత్యం ప్రజలు వాడే నిత్యావసర వస్తువులతో పాటు, కూరగాయలు, ఆహార ధాన్యాలు, మందులు ధరలు, మరింత పెంచి ప్రజల పైన ఆర్థిక భారాలను మోపుతున్నారు అన్నారు. మేము అధికారంలోకి వస్తే ప్రజల కష్టాలను తీరుస్తామని ధరలను అదుపు చేస్తామని ఉపాధి ఉద్యోగ అవకాశాలను పెంచుతామని విద్యుత్ ఛార్జీలను పెంచమని ఎన్నికలలో చెప్పిన వాగ్దానాలను విస్మరించి ట్రూ ఆఫ్ చార్జీలుపేరుతో గత రెండు సంవత్సరాల విద్యుత్ బకాయిలు ఉన్నాయని పేరుతో ప్రజలపై ఛార్జీలను సుమారు 20 వేల కోట్ల రూపాయల విద్యుత్ బారాలను ప్రజలపై మోపుతున్నారు అన్నారు. స్మార్ట్ మీటర్లు పెట్టమని చెప్పిన ప్రభుత్వం ఆ విషయాన్ని మరిచి స్మార్ట్ మీటర్లు రైతులు మోటర్లకు మీటర్లు బిగిస్తు ప్రజల పైన వ్యాపారుల పైన రైతుల పైన విద్యుత్తు బారాలను మరింత మోపే ప్రయత్నం చేస్తున్నారన్నారు. రాష్ట్రంలో ఇసుక సమస్యతో నిర్మాణరంగం దానికి అనుబంధంగా ఉన్న సుమారు 30 రకాల వ్యాపార ఉపాధి రంగాలు మను గడ లేకుండా పోయాయి




అన్నారు. నిర్మాణ రంగ కార్మికులు ఉపాధి లేక అప్పుల పాలు అవుతున్నారన్నారు. ఉచిత ఇసుక పాలసీని సక్రమంగా అమలు చేసి నిర్మాణ రంగాన్ని ఆదుకోవాలని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలకు రాష్ట్రంలో ఉన్న కుటమీ ప్రభుత్వం వంత పాడుతుందన్నారు. విశాఖ ఉక్కు ప్రైవేటుకరణ అడ్డుకోవడంలో ముఖ్యమంత్రి ఉప ముఖ్యమంత్రి మాటలలో స్పష్టత కనిపించట్లేదు అన్నారు. ఉక్కు ఫ్యాక్టరీలో టిఆర్ఎస్కీమ్ కాంట్రాక్ట్ కార్మికులను తొలగించే ప్రయత్నాలను చాప కింద నీరులా కేంద్ర ప్రభుత్వం చేస్తుందని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం పార్టీ మండల కార్యదర్శి జల్లి రామ్మోహన్, మండల కమిటీ సభ్యులు తెలగం శెట్టి సత్యనారాయణ,పట్టణ కమిటీ సభ్యులు పొగాకు నారాయణరావు, నోములకొండ,బూడిద జోగేశ్వరరావు,కోడి లక్ష్మణ్, కోరాడ బద్రి,పొన్నాడ మల్లేష్, పైల సత్తిబాబు, సోమేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

# బిర్సా ముండా పోరాటాలు ఆదివాసీలకు స్ఫూర్తి దాయకం

కేంద్రమంత్రి డాక్టర్ పెమ్మసానిని సన్మానించిన డాక్టర్ దేవరకొండ

విజయవాడ/ ఏలూరు, మేజర్‌న్యూస్: భగవాన్ బిర్సా ముండా 149 వ జయంతిని పురస్కరించుకుని ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో గిరిజన స్వాభిమాన ఉత్సవాలను శుక్రవారం ఘనంగా నిర్వహించింది. ఈ ఉత్సవాలకు ముఖ్య అతిథులుగా కేంద్ర గ్రామీణాభివృద్ధి, కమ్యూనికేషన్ సహాయ శాఖా మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ, స్త్రీ , శిశు సంక్షేమ శాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి, కేంద్ర , రాష్ట్ర ప్రభుత్వ ఉన్నతాధికారులు అమిత్ శుక్లా, కె. కన్నబాబు, తదితరులు హాజరయ్యారు. ఈ కార్యక్రమానికి ప్రత్యేక అతిథులుగా ఎస్టీ ఎంప్లాయిస్ అసోసియేషన్ ఆఫ్ ఆల్ ఇండియా తరుపున సంఘం నేషనల్ ప్రెసిడెంట్ డాక్టర్ దేవరకొండ వెంకటేశ్వర్లు హాజరయ్యారు. ముఖ్య అతిథులు మాట్లాడుతూ బిర్సా ముండా పోరాటాలు, ఉద్యమాలు నేటి తరాల ఆదివాసులకు స్ఫూర్తి, మార్గదర్శకమని కొనియాడారు. ఆదివాసుల సంక్షేమము, అభివృద్ధి కోసం 6600 కోట్ల రూపాయలు విలువైన పథకాలను కేంద్రమంత్రి ప్రారంభోత్సవం చేశారు. విభిన్న ప్రభుత్వ పథకాలు ఎస్టీ లబ్ధిదారులకు కేంద్ర మంత్రి సంబంధిత పత్రాలను అందించారు. రాష్ట్ర ప్రభుత్వ కార్యక్రమం ప్రారంభానికి తొలుత కేంద్రం తరుపు న బీహార్లో ప్రధానమంత్రి నరేంద్ర మోడీ సమక్షంలో ఉత్సవాలు ప్రారంభించబడ్డాయి. సభికులు వాటిని ప్రత్యక్ష ప్రసారం ద్వారా తిలకించిన పిమ్మట రాష్ట్ర ప్రభుత్వ ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. రాష్ట్ర గిరిజన శాఖ మంత్రి సమక్షంలో ఆదివాసీ సంఘాల తరపున కేంద్రమంత్రి వర్యులను సన్మానించి దేవరకొండ లలితా వెంకటేశ్వర్లు చే సంకలనం చేయబడిన ద్విభాషా రాజ్యాంగ ప్రతిని బహుకరించడం జరిగింది. ఈ సన్మాన కార్యక్రమంలో ఆదివాసీ నాయకులు డాక్టర్ దేవరకొండ వెంకటేశ్వర్లు,నల్గొండ రామయ్య, మాదిగాని గురునాథం, తిరువీధుల శంకర ప్రసాద్ , మల్లి భాస్కరావు, నాయక్ , కొండయ్య దొర, శ్రీనివాస కొమరం భీం, పాలపర్తి శ్రీనివాసరావు,చెస్ ఛాంపియన్ దేవరకొండ ఎల్వీ విజ్ఞాన్ భరత్, తదితరులు పాల్గొన్నారు.

## గ్రంథాలయాల సేవలు సద్వినియోగం చేసుకోవాలి




ద్వారకాతిరుమల,మేజర్‌న్యూస్: శాఖా గ్రంథాలయం నందు జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు సందర్భంగా శుక్రవారం పుస్తక ప్రదర్శన కార్యక్రమాన్ని నిర్వహించి ఈ మన గ్రంథాలయంలో దిన,వార, పక్ష, నెల,పత్రికలు, మేగజైన్స్, డిక్షనరీలు, ఎన్సైక్లోపీడియోస్, నవలలు,అన్ని మతాల, ఆరోగ్య సంబంధిత, వివిధ పోటీ పరీక్షలకు సంబంధించిన చిన్నపిల్లల మొదలు, వృద్ధుల వరకు అన్ని వర్గాల ప్రజలకు అన్ని సబ్జెక్టులకు సంబంధించిన పుస్తకాలు అందుబాటులో ఉన్నాయని గ్రంథాలయాన్ని సందర్శించి జ్ఞాన సముపార్జన చేయాలని, సభ్యత్వం ద్వారా, సభ్యులుగా చేరిమరిన్ని సేవలు పొందవచ్చు అని గ్రంథాలయ అధికారిని జి.బంగారు పాప తెలియజేశారు. అనంతరం సచివాలయ మహిళా కానిస్టేబుల్ లక్ష్మీ సృజన నేటి యువత తాత్కాలిక ఆనందం కోసం డ్రగ్స్ మహమ్మారికి (మద్యపానం,ధూమపానం, గుట్కా,ఖైని,తంబాకు, గంజాయి, నల్లమందు మొ.వాటికి) బానిసలు అయ్యి చదువు,ఆరోగ్యం పాడుచేసుకుంటూ వారిబంగారు భవిష్యత్తును,సర్వ నాశనం చేసుకుంటూ తల్లిదండ్రులకు మానసిక వ్యథకు,కారకులు అవుచున్నారు అని తెలియచేసి,యువత జీవితాలను, నిర్వీర్యం చేసే డ్రగ్స్ భూతాన్ని, మన రాష్ట్రం నుండి పూర్తిగా నిర్మూలనలో భాగస్వామ్యం అవుదాం అని విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ గురుకుల టీచర్ వి.శ్రీదేవి, గ్రంథాలయ సహాయకురాలు బట్టు మణి, విద్యార్థులు పాల్గొన్నారు.

## నేడు ఎమ్మెల్యే నాయకర్ నర్సాపురం రాక



**నర్సాపురం,మేజర్‌న్యూస్:** ఎమ్మెల్యే బొమ్మిడి నాయకర్ శనివారం నర్సాపురం రానున్నారు. ప్రభుత్వ విప్‌గా నియమితులైన అనంతరం మొదటిసారి నియోజకవర్గానికి వస్తున్నారు. శనివారం మధ్యాహ్నం మూడు గంటలకు స్థానిక ఇసుక ర్యాంపు సమీపంలో ఆయనకు స్వాగతం పలికేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. నియోజకవర్గ నుండి పెద్ద ఎత్తున కార్యకర్తలను సమీకరించి బైక్ ర్యాలీ ద్వారా పట్టణ ప్రధాన వీధుల గుండా జనసేన పార్టీ కార్యాలయానికి నాయకర్ చేరుకోనున్నారు.

## మున్సిపల్ సెక్రటరీని కలిసిన కమిషనర్



**అమరావతి,నర్సాపురం,మేజర్‌న్యూస్:** మున్సిపల్ ప్రిన్సిపల్ సెక్రటరీగా బాధ్యతలు చేపట్టినకే కన్నబాబును మున్సిపల్ కమిషనర్ ఎం అంజయ్య శుక్రవారం అమరావతి లోని ఆయన కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించారు. ఈసందర్భంగా నర్సాపురం మున్సిపాలిటీ అభివృద్ధికి సహకారం అందించవలసిందిగా కన్నబాబును కమిషనర్ కోరారు. ఆయనతోపాటు మున్సిపల్ రెవెన్యూ ఆర్.ఐ. నానాజీ, బాలు, గోపి తదితరులు ఉన్నారు.

# శాఖా గ్రంధాలయంలో పుస్తక ప్రదర్శన ప్రారంభ

**నరసాపురం,మేజర్‌న్యూస్:** ప్రధమ శ్రేణి శా ఖగ్రంధాలయం నందు 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల సందర్భంగా ఏర్పాటు చేసిన పుస్తక ప్రదర్శనకు శాస్త్రవేత్త సుబ్బారావు స్వాగతం పలుకగా,పశ్చిమగోదావరి జిల్లా గ్రంధాల సంస్థ కార్యదర్శి ఎం శేఖర్ బాబు ముఖ్యఅతిథిగా పాల్గొని పుస్త ప్రదర్శనను ప్రారంభించారు. శుక్రవారం జరిగిన ఈ కార్యక్రమంలో ఆయనమాట్లాడుతూ సమసమాజ నిర్మాణానికి పురోభివృద్ధికి జ్ఞానమే మూలమని, గ్రంథ పఠనం ద్వారానే జ్ఞానస ముపార్జన సాధ్యమని గ్రంథాలయాలు సామాజిక విద్యా కేంద్రాలని కథలు చదవడంతో ఊహ శక్తి పెరుగుతుందన్నారు.స్ఫూర్తినిచ్చే కథలు, దేశ నాయకులు కథలు, దేశ స్వాతంత్రం కోసం పోరాడిన వారి చరిత్ర తెలుసుకోవాలి పుస్తక పఠనం ద్వారా భావిభారత పౌరులుగా తీర్చిదిద్దబడతారని అన్నారు. గ్రంథాలయ వారోత్సవం సందర్భంగా నరసాపురం గ్రేడ్ వన్ గ్రంథాలయానికి మీ అందరి సహాయ సహకారాలు అందిస్తున్న అందరికీ గ్రంథాలయ వారోత్స వాలు శుభాకాంక్షలు తెలియజేస్తున్నానని శేఖర్ బాబు అన్నారు.మాద క ద్రవ్యాల పైఅవగాహన సదస్సులో సర్కిల్ ఇన్స్పెక్టర్ యాదగిరి పాల్గొని పిల్లలకు డ్రగ్స్ తీసు కొనుట ద్వారా కలిగే దుష్ఫలితాల గురించి వివరించారు. అనంతరం పత్రిక పఠనం పోటీలునిర్వహించారు. రెడ్డప్ప ధవేజీ, కృష్ణవేణి, ఉమాపతిరావు న్యాయ నిర్ణే తలుగా వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ సాంబమూర్తి, డాక్టర్ చినమిల్లి శ్రీనివాస్,సత్యవతి, కోట్ల రాంకుమార్,సూర్య కుమారి,కృష్ణమూర్తి,లైన్స్ క్లబ్ సభ్యులు డాక్టర్ రాజేంద్రప్రసాద్ ,బాబు శ్రీ, భట్టిప్రోలు సత్యనారాయణ, సుధీర్ మోహన్ ,సూర్యం బాబు, నాగలక్ష్మి టీచర్ ,ఇంద్ర వాణి, టీచర్ అపర్ణ, టీచర్



గౌతమ్ విద్యార్థులు నరసాపురం గ్రంథాలయంను సంద ర్శించి పోటీలలో పాల్గొన్నారు. నరసాపురంసన్ షైన్ స్కూల్, సూర్య స్కూల్, భాష్యం స్కూల్,మున్సిపల్ స్కూల్స్ తదితర విద్యాసంస్థల నుండి అధిక సంఖ్యలో పిల్లలు, గ్రంథాలయ పాఠకులు పాల్గొన్నారు. గ్రంథాలయ అభివృద్ధి కమిటీ వారు కార్యదర్శి శేఖర్ బాబుని, సీఐ యాదగిరిని శాలువాతో సత్కరించారు. రోటరీ క్లబ్ వారు గ్రేడ్ వన్ లైబ్రరీ యన్ కుమారిని ఉత్తమ గ్రంథపాలకురాలిఅవార్డు వచ్చిన సందర్భంగా సన్మానం చేసినారు. రేపు జరిగే వ్యాసరచన పోటీలో పిల్లలందరూ పాల్గొనవలసిందిగా గ్రేడ్ వన్ లైబ్రరీ యన్ కుమారి కోరారు.

## ద్వారకాతిరుమల గ్రామంలో తెలుగుదేశం పార్టీ సభ్యత్వాల నమోదు



**ద్వారకాతిరుమల, మేజర్‌న్యూస్:** గ్రామంలో దూసుకుపోతున్న తెలుగుదేశం పార్టీ సభ్యత్వాలు స్థానిక తెలుగుదేశం పార్టీ నాయకులు గోపాలపురం వాణిజ్య సెల్ అధ్యక్షుడు ఇమ్మడి రత్నాజీ ఆధ్వర్యంలో సభ్యత్వాల నమోదు కార్యక్రమం నిర్వహించారు.శుక్రవారం సుమారు 100కు పైగా సభ్యత్వాలు నమోదు చేయించారు. పార్టీ సభ్యత్వం చేయించుకుంటే కలిగే ప్రయోజనాలను తెలుగుదేశం పార్టీ కార్యకర్తలకు రత్నాజీ వివరించారు.

## భక్తులతో పోట్టిత్తిన శివాలయాలు





**ద్వారకతిరుమల,మేజర్‌న్యూస్:** మండలంలోని శివాలయాలు పవిత్రమైన కార్తీక పౌర్ణమి పర్వదినోత్సవాన్ని పురస్కరించుకుని భక్తులతో పోటెత్తాయి.ఆలయ అర్చకులు రాఘవస్వామి వివిధ ద్రవపదార్థాలతో అభిషేకాలు నిర్వహించి అమ్మవార్లకు కుంకుమ పూజలుచేసి కర్పూర హారతి ఇచ్చారు.వేకువజాము నుండి శివనామస్మరణలతో భక్తులు దీపాలను వెలిగించుకుని పూజలు నిర్వహించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

## ప్రతి హిందువు హైందవ శంఖారావం సభ విజయవంతం చేయాలి

### జిల్లా ప్రముఖ్ వంశీ పిలుపు



**నూజివీడు, మేజర్‌న్యూస్:** ప్రభుత్వ పెత్తనం నుండి హిందూ దేవాలయాలకు విముక్తి చేసి, హిందూ ధార్మిక సంఘాలకు అప్పగించాలనే డిమాండ్‌తో జనవరి 5న విజయవాడలో హైందవ శంఖారావం భారీ బహిరంగ సభ నిర్వహిస్తున్నామని హైందవ శంఖారావం జిల్లా ప్రముఖ్ వంశీ జీ అన్నారు.శుక్రవారం సాయంత్రం ఏలూరు జిల్లా నూజివీడులోని మాటూరి హోటల్‌లో హైందవ శంఖారావం నూజివీడు ఖండ సన్నాహక సమావేశం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన వంశీ జీ మాట్లాడుతూ హైందవ శంఖారావ సభ ద్వారా దేశవ్యాప్తంగా హిందూ దేవాలయాలను ప్రభుత్వ నియంత్రణ నుండి విముక్తి చేసి స్వయం ప్రతిపత్తి కలిగిన ధార్మిక వ్యవస్థకు అప్పగిస్తూ చట్టం చేయాలని విశ్వహిందూ పరిషత్ ఒక జాతీయ ఉద్యమానికి శ్రీకారం చుట్టిందని అన్నారు. రాజకీయ పార్టీలతో సంబంధం లేకుండా దేవాలయ ట్రస్ట్ బోర్డుల్లో హిందూ దైవ భక్తులకు మాత్రమే స్థానం కల్పించాలని అన్నారు. ప్రతి గ్రామం నుండి పెద్ద సంఖ్యలో హిందువులు తరలివచ్చి హైందవ శంఖారావ సభ ను విజయవంతం చేయాలని వంశీ జీ కోరారు. ఈ సందర్భంగా హైందవ శంఖారావం కరపత్రాన్ని ఆవిష్కరించారు. ఈ సమావేశంలో సంఘ పరివార్, వివిధ క్షేత్ర కార్యకర్తలు, విశ్వ హిందూ పరిషత్ నాయకులు ప్రకాష్, నాగరాజు, బిజెపి ఏలూరు పార్లమెంట్ కన్వీనర్ కృష్ణ ప్రసాద్, బిజెపి నూజివీడు నియోజకవర్గ కన్వీనర్ జి ఆర్ కె రంగారావు, అప్పారావు, వసుంధర దేవి తదితరులు పాల్గొన్నారు.

## పుస్తక ప్రదర్శన, మాదకద్రవ్యాల నష్టాలపై అవగాహన





**ఏలూరు,మేజర్‌న్యూస్:** 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం నిర్వహించిన పుస్తక ప్రదర్శనను ప్రముఖ సామాజికవేత్త కేబి రావు ప్రారంభించారు. తరగతి గదిలో చదివే చదువు జ్ఞానాన్ని మాత్రమే ఇస్తుందని, గ్రంథాలయంలో చదివే పుస్తకాలతో విజ్ఞానాన్ని పెంపొందించుకోవచ్చని, విద్యార్థులు తమ జ్ఞానంతో ఏది మంచి ఏది చెడు అని నిర్ణయించుకునే ఆలోచన శక్తిని పెంపొందించుకుంటారనిఅన్నారు. మాదకద్రవ్యాలు, చెడు వ్యసనాలకు దూరంగా ఉంటారని వారు తెలియజేశారు. ఏలూరుకు గల విశిష్టతను బాలల గ్రంథాలయానికి గల ప్రాముఖ్యతను వారు వివరించారు. గ్రంథాలయ శాశ్వత భవనానికి అవసరమయ్యే స్థల సేకరణ కొరకు వారు చేస్తున్న కృషిని తెలిపారు.

ఈ కార్యక్రమంలో అభివృద్ధి కమిటీ అధ్యక్షులు కారం శెట్టి రమేష్ బాబు, గ్రంథాలయ నిర్వాహకురాలు ఎమ్.శోభ,అభివృద్ధి కమిటీ సభ్యులు వి. కొండలరావు , ఎల్ చాముండేశ్వరరావు , నరసింహారావు, పద్మనాభ రావు, వివిధ పాఠశాలల ఉపాధ్యాయులు, పాఠ కులు, అధిక సంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు. విద్యార్థులకు వకృత్వం పోటీలు జరిగాయి.

## లక్ష్మణే శ్వరంలో సహస్ర దీపాలంకరణ



**నర్సాపురంరూరల్,మేజర్‌న్యూస్ :** మండలంలోని లక్ష్మణేశ్వరంలో గల శ్రీ దుర్గా లక్ష్మణేశ్వర స్వామి వారి ఆలయంలో కార్తీక పౌర్ణమి సందర్భంగా శుక్రవారం సహస్ర దీపాలంకరణ ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు. ఆలయ కార్యనిర్వాహణాధికారి సిహెచ్ సురేష్ నాయుడు, సిబ్బంది ఎం రమేష్ ఏర్పాట్లు పరిశీలించారు.

## కార్తీకమాసం పౌర్ణమి ప్రత్యేక పూజలు



**పెదవేగి,మేజర్‌న్యూస్:** కార్తీక పౌర్ణమి సందర్భంగా శుక్రవారం ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. ప్రధానంగా శైవక్షేత్రాల్లో భక్తులు అధికసంఖ్యలో పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. పెదవేగి, విజయరాయి, రామశింగవరం, కొప్పాక, దుగ్గిరాల, వంగూరు, బి.సిం గవరం తదితర గ్రామాల్లో శివాలయాలకు శుక్రవారం తెల్లవారుజామునుంచే పోటెత్తిన భక్తులు స్వామి, అమ్మవార్లను దర్శించుకొని పూజలు నిర్వహించారు. శుక్రవారం ఉదయంనుంచి ఉపవాస దీక్ష చేసిన భక్తులు సాయంత్రం శివాలయంలో కార్తీక దీపారాదనలు చేసి, శివాలయ దర్శనం అనంతరం ఉపవాస దీక్షలు విరమించారు. పెదవేగిలోని పురాతన శివాలయంలో భక్తులు ప్రత్యేకపూజలు నిర్వహించారు. ఆలయ అర్చకుడు తిప్పాభట్ల సుబ్రహ్మణ్యశర్మ ఆధ్వర్యంలో స్వామికి ఉదయం ప్రత్యేక పంచామృత అభిషేకాలు నిర్వహించారు. సాయంత్రం అమ్మవారికి ప్రత్యేక కుంకుమ పూజలు చేశారు. ఈ సందర్భంగా అర్చకుడు సుబ్రహ్మణ్యశర్మ మాట్లాడుతూ కార్తీక మాసం శివకేశవులు ఇద్దరికీ ఎంతో ఇష్టమైన నెల అన్నారు. ఈనెలలో నదీస్నానం ఎంతో శ్రేయస్కరమని, తెల్లవారు జామున నది స్నానం సంపూర్ణ ఆరోగ్యానికి దోహదపడుతుందని ఆయన తెలిపారు.

## గ్రంథాలయాలకు రావడాన్ని అలవాటుగా మార్చుకోవాలి

### పెదవేగి సీఐ వెంకటేశ్వరరావు



**పెదవేగి,మేజర్‌న్యూస్ :** గ్రంథాలయాలకు రావడాన్ని ఒక అలవాటుగా మార్చుకోవాలని పెదవేగి సీఐ కె.వెం కటేశ్వరరావు అన్నారు. మండల కేంద్రం పెదవేగిలోని శాఖా గ్రంథాలయంలో జరుగుతున్న 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం పుస్తక ప్రదర్శన నిర్వహించారు. ఈ కార్యక్రమానికి విచ్చేసిన సీఐ వెంకటేశ్వరరావు మాట్లాడుతూ గ్రందపఠనంతో విజ్ఞానం.

వివేకం వస్తాయన్నారు. గ్రంథాలయానికి రావడాన్ని ఒక అలవాటుగా చేసుకుంటే గ్రందపఠనంపై ఆసక్తి పెరుగుతుందని, తద్వారా ప్రజలు మరింత విజ్ఞానాన్ని అందిపు చ్చుకునే వీలుంటుందని ఆయన తెలిపారు. గ్రంథాలయ వారోత్సవాల నిర్వహణతో ప్రజల్లో గ్రంథాలయాలపట్ల ఆసక్తి పెరుగుతుందనే నమ్మకాన్ని ఆయన వ్యక్తంచేశారు. విద్యార్థి దశనుంచే గ్రంథపఠనం చేస్తే ఆ విద్యార్థి గొప్ప విజ్ఞానవంతుడవుతాడని ఆయన వివరించారు. పెదవేగి ఎస్ఐ కె.రామ కృష్ణ మాట్లాడుతూ మత్తును మించిన బానిసగా చేసేది సెల్ఫోన్ అన్నారు. సెల్ఫోన్కు ఎంత దూరంగా ఉంటే అంత ఆరోగ్యమని, అదే అభివృద్ధికి చిహ్నామని ఆయన తెలిపారు. పెదవేగి గ్రామ మహిళా సంరక్షణ కార్యదర్శి ఎం.జ్యోతి, గ్రందపాలకుడు తోట అరుణ కుమార్. విద్యార్థులు పాల్గొన్నారు.

# రహదారి భద్రతా నియమాలు పాటించాలి

## ఆటో డ్రైవర్లు అప్రమత్తంగా లేకపోతే అతడితో పాటు ప్రయాణికులకు ప్రమాదం




**ఏలూరు,మేజర్‌న్యూస్:** రహదారి ప్రమాదాల బారిన పడకుండా ఉండాలంటే కచ్చితంగా రహదారి భద్రత నియమాలను పాటించాలని, తద్వారానే ప్రమాదాల బారిన పడకుండా ఉంటామని జిల్లా ఉప రవాణా కమిషనర్ షేక్ కరీం తెలిపారు,ఏలూరు నగరంలోని జిల్లా ఉపరవాణ కమిషనర్ కార్యాలయంలో రోడ్డు భద్రత కార్యక్రమంలో భాగంగా ఆటో డ్రైవర్లకు రోడ్డు ప్రమాదాలపై ప్రత్యేక అవగాహన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో నగరంలోని ఆటో డ్రైవర్లు,ఆటో యూనియన్ల నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా ఉపరవాణ కమిషనర్ కరీం మాట్లాడుతూ ఆటో డ్రైవర్లు ప్రజా రవాణా విభాగంలో పనిచేస్తూఉండడం వల్ల వారు రోడ్డు ప్రమాదానికి గురైతే, వారితో పాటుగా ప్రయాణికులు కూడా రోడ్డు ప్రమాదానికి గురవుతారని ఇది ముఖ్య కారణంగా వారు ఎప్పుడు రోడ్డు భద్రతపై అవగాహన కలిగి ఉండాలని సూచించారు. అంతేకాకుండా తాము వినియోగించే ఆటోల భీమా ఫిట్నెస్ పత్రాలను ఎప్పటికప్పుడు సరిచూసుకుంటూ ఆటోలను నడపాలని తెలియజేశారు లైసెన్సులు లేకుండా ఆటో నడిపినట్లు అయితే 5వేల రూపాయల వరకు జరిమానా విధింప పడుతుందని, కచ్చితంగా ఆటో డ్రైవర్లు బ్యాడ్జ్ కలిగిన డ్రైవింగ్ లైసెన్స్ వినియోగించాలని తెలిపారు. దేశవ్యాప్తంగా నాలుగున్నర లక్షల రోడ్డు ప్రమాదాలు జరిగాయని అందులో ఒకటిన్నర లక్షల మంది ప్రాణాలు కోల్పోయారని దాదాపుగా నాలుగు లక్షల అరవై వేల మంది తీవ్ర గాయాల పాలయ్యారని ఆయన తెలిపారు. ఏలూరు జిల్లాలో గత ఏడాది 633 రోడ్డు ప్రమాదాలు జరగగా 254 మంది మృతి చెందారని, 617 మంది తీవ్ర గాయాల పాలయ్యారని ఆయన తెలిపారు. ఈ సంవత్సరం సెప్టెంబర్ నెల వరకు 419 రోడ్డు ప్రమాదాలు జరిగాయని, వీటిలో 214 మంది మృత్యువాత పడ్డారని, 440 మంది తీవ్ర గాయాల పాలయ్యారని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంబిఐ ఎండి విటల్ బి శేఖర్ ఎస్ జగదీష్ వైవిఎస్ కళ్యాణి జి స్వామి పి నరేంద్ర డి ప్రజ్ఞ పాల్గొన్నారు.

## గౌడ కార్తీక వన సమారాధన చైర్మన్‌గా పడమట గణేష్





**మండవల్లి,మేజర్ న్యూస్:** కైక లూరు నియోజకవర్గ గౌడ సంఘ కార్తిక వన సమారాధన కమిటీ చైర్మన్‌గా పడమట గణేష్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. శుక్రవారం మండవల్లి మండలం లోకుమూడి దత్తాశ్రమం నందు కైకలూరు నియోజకవర్గ గౌడ సంఘం అధ్యక్షుడు పోలగాని నాగరాజు అధ్యక్షతన కార్తిక వన సమారాధన ఏర్పాట్లపై సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా రాష్ట్ర గౌడ సంఘ నాయకులు పోసిన చెంచు రామారావు హాజరయ్యారు. ప్రథమంగా కార్తిక వన సమారాధన కమిటీ చైర్మన్ ను ఎన్నుకున్నారు.ఈ సందర్భంగా పోసిన చెంచు రామారావు మాట్లాడుతూ ప్రతి ఏడాది లాగానే గౌడ కార్తీక వన సమారాధన ఘనంగా నిర్వహిస్తామన్నారు. ఈసారి మండవల్లి మండలంలో కార్తీక వన సమారాధన జరపనున్నట్లు వివరించారు. కార్యక్రమంలో వీరమల్లు నరసింహారావు, పరసా ఏడుకొం డలు,పోసిన పాపారావు గౌడ్,జోగి సురేష్ ,బత్తిన కిషోర్,శొంఠి నాగరాజు,మండవల్లి మండల అధ్యక్షులు బొర్రా సత్యనారాయణ, కైకలూరు మండల అధ్యక్షులు కట్టా నాగబాబు, కలిదిండి మండల అధ్యక్షులు కట్టా పాండురంగారావు, దాసరి శ్రీనివాసరావు,మారగాని గణపతి,కట్టా వీర రాఘవులు, మారగాని పెదబాబు, మురాల జగన్నాథం,కట్టా నాని,పరింకాయల వెంకటేశ్వరరావు,గూడవల్లి కోటేశ్వరరావు,వీరమల్లు మల్లేశ్వరరావు, శొంఠి వీర ముసలయ్య,పొలవరపు కిరణ్, మేకా విజయ్ కుమార్,తదితరులు పాల్గొన్నారు.

## మద్యం బెల్టు షాపు నిర్వహిస్తున్న వ్యక్తి అరెస్టు



**పాలకొల్లు, మేజర్‌న్యూస్:**పాలకొల్లు ప్రొహిబిషన్ ఎక్సైజ్ స్టేషన్ శుక్రవారం నిర్వహించిన దాడులలో పాలకొల్లు రూరల్ మండలం వెదుళ్లపాలెం గ్రామానికి చెందిన మాదు వేంకటేశ్వర రావు అను వ్యక్తిని అరెస్టు చేసి అతని వద్దనుండి 7 మద్యం బాటిళ్ళను స్వాధీనం చేసుకోవడం జరిగింది.

ఈ దాడులలో ఎస్ఐలు పి.మహేష్, జి.రఘు సిబ్బంది పాల్గొన్నారు. బెల్ట్ షాపులు నిర్వహిస్తే కఠిన చర్యలు తప్పవని పాలకొల్లు ప్రొహిబిషన్, ఎక్సైజ్ ఇన్స్పెక్టర్ మద్దాల శ్రీనివాస్ తెలియ చేశారు.

## అర్హులైన పేదలందరికీ భూమి, ఇంటి నిర్మాణంకు ఐదు లక్షలు కేటాయించాలి



బికేయంయు జిల్లా కార్యదర్శి కళింగ లక్ష్మణరావు డిమాండ్.

పెంటపాడు, మేజర్ న్యూస్: పెంటపాడు గ్రామ ప్రజలకు గత వైసిపి ప్రభుత్వం హయాంలో అర్హులైన 523 మంది పేదవారికి తక్షణమే ఇళ్ల స్థలాలు కేటాయించాలని, ఆ ఇంటి నిర్మాణాలకు ఒక్కొక్కరికి ఐదు లక్షల చొప్పున చెల్లించాలని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం పశ్చిమగోదావరి జిల్లా కార్యదర్శి కళింగ లక్ష్మణరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సిపిఐ ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో నవంబర్ 18న ఇళ్ల స్థలాల కొరకు గ్రామ సచివాలయాల వద్ద వ్యక్తిగత అర్జీల సమర్పణ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం పెంటపాడు గ్రామంలోని వెలమపేట రామాలయం వద్ద ఇళ్ల స్థలాల లబ్ధిదారులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారికి కరపత్రాలు అందించారు. గత ప్రభుత్వం హయాంలో పెంటపాడు ప్రజలకు ఇళ్ల స్థలాలు మంజూరు చేస్తారని ఎదురుచూపులు చూసారు. ఎన్నికల హామీల మేరకు కూటమి ప్రభుత్వం ఇచ్చిన మేనిఫెస్టో ప్రకారం పేదలకు గ్రామాలలో 3 సెంట్లు, ఇంటి నిర్మాణం కొరకు రూ.ఐదు లక్షలు తక్షణమే అందించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం నాయకులు బందారు శ్రీనివాసరావు, బిల్డింగ్ వర్కర్స్ నాయకులు నల్లమిల్లి ఫణి శ్రీనివాస్ రెడ్డి, వెలమపేట లబ్ధిదారులు పాల్గొన్నారు.

## శ్రీ అష్టభుజ లక్ష్మీనారాయణ స్వామి ఊరేగింపు



**పాలకొల్లు,మేజర్‌న్యూస్ :** శ్రీ అష్టభుజ లక్ష్మీనారాయణ స్వామి వారి ఊరేగింపు దేదీప్యమానంగా జరిగింది, వైభవంగా మేళ తాళాలతో నిర్వహించారు, స్వామివారిని దర్శించు కున్నారు, భక్తులకు ఆశీర్వచనం చేశారు,

## కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ సమన్వయకర్తగా పోలిశెట్టి నారాయణ స్వామి (బాబ్జీ)



**నరసాపురం,మేజర్‌న్యూస్:** నరసాపురం నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ సమన్వయకర్తగా నరసాపురం న్యాయ వాదుల సంఘం మాజీ అధ్యక్షులు, సీనియర్ న్యాయవాది పోలిశెట్టి వీర వెంకట నారాయణ స్వామి (బాబ్జీ)ని నియమిస్తూ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు వై.ఎస్. షర్మిల శుక్రవారం ప్రకటించారు.బాబ్జీ చిన్నతనం నుండి కాంగ్రెస్‌లో ఉంటూ పార్టీకి పలు సేవలు అందించారు. దివంగత కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు పోలిశెట్టి వాసుదేవరావు అన్న కుమారుడు అయిన పోలిశెట్టి బాబ్జీ కి సీనియర్ న్యాయవాదిగా నరసాపురం నియోజకవర్గంలో మంచి గుర్తింపు ఉంది.

బాబ్జీ నరసాపురం న్యాయవాదుల సంఘం అధ్యక్షునిగా రెండు పర్యాయాలు బాధ్యతలు నిర్వర్తించారు. కాంగ్రెస్ పార్టీలో ఎన్ని ఒడుదుడుకులు ఎదుర్కొనప్పటికీ ఆయన పార్టీలో అంకిత భావంతో కొనసాగుతున్నారు.బాబ్జీ నియామకం పట్ల కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలతో బాటు పలువురు అభినందనలు తెలిపారు.

# నార్నె నితిన్, నయన్ సారిక జంటగా నటించిన ఆయ్.. ఈ ఆదివారం మధ్యాహ్నం 3 గంటలకు, మీ జీ తెలుగులో!

ఏలూరు మేజర్ న్యూస్: వారం వారం సరికొత్త సినిమాలతో తెలుగు ప్రేక్షకులను అలరిస్తున్న జీ తెలుగు ఈ ఆదివారం మరో కొత్త సినిమాతో మీ ముందుకు రాబోతోంది. టాలీవుడ్ యంగ్ హీరో నార్నె నితిన్ ప్రధాన పాత్రలో నటించిన ఆయ్ సినిమాని ఈ వారం వరల్డ్ టెలివిజన్ ప్రీమియర్గా అందించేందుకు సిద్ధమైంది. థియేటర్లో సూపర్హిట్గా నిలిచిన ఈ సినిమా బుల్లితెర ప్రేక్షకులను అలరించేందుకు వచ్చేస్తోంది. రొమాం టిక్ కామెడీ ఎంటర్టైనర్ ఆయ్ నవంబర్ 17, ఆదివారం మధ్యాహ్నం 3 గంటలకు మీ జీ తెలుగులో మాత్రమే!




ఈ సినిమా కథ గోదావరి నదిలోని పసలపూడిలంక నేపథ్యంలో సాగుతుంది. కార్తీక్(నార్నే నితిన్), సుబ్బు(కసిరెడ్డి రాజ్కుమార్), హరి( అంకిత్ కొయ్య) చిన్నప్పటినుంచి మంచి స్నేహితులు. వర్క్ ఫ్రమ్ హోం కోసం ఊరికి వచ్చిన కార్తీక్ పల్లవి(నయని సారిక) అనే అమ్మాయిని ప్రేమిస్తాడు. ఆమె కూడా అతడిని ఇష్ట పడుతుంది.

అదే అమ్మాయిని సుబ్బు కూడా ప్రేమిస్తాడు. మరి పల్లవి ఎవరిని ప్రేమిస్తుంది..? వారికి ఎదురైన అడ్డంకులను ఎలా పరిష్కరించారు? అనేది తెలియాలంటే జీ తెలుగులో ఈ ఆదివారం ప్రసారమయ్యే ఆయ్ సినిమా చూడాల్సిందే.

అంజి కె మణిపుత్ర దర్శకత్వంలో రూపొందిన ఆయ్ సినిమా రొమాంటిక్ కామెడీ ఎంటర్టైనర్గా రిలీజై ప్రేక్షకులను బాగా ఆకట్టుకుంది. ఆకట్టుకునే లవ్ ట్రాక్తో పాటు కడుపుబ్బా నవ్వించే కామెడీ పంచులతో ఆద్యంతం అలరించి సూపర్ హిట్గా నిలిచింది. ఆసక్తికరమైన కథాంశం, ఊహించని ట్విస్ట్లతో ప్రేక్షకులను మెప్పించిన ఆయ్ సినిమాని ఈ ఆదివారం జీ తెలుగు వేదికగా మీరూ తప్పకుండా చూడండి.

# కొల్లేరు ప్రజలకు అండగా ఉంటాం

### వలసలునివారించండి - రహదారులు నిర్మించండి
### సమస్యలు పరిష్కరించకపోతే ఫిబ్రవరి 1 నుండి దీక్షలు
### కొల్లేరు పర్యటనలో సిపిఐ జాతీయ కార్యదర్శి కె నారాయణ





**మండవల్లి,మేజర్‌న్యూస్:** కొల్లేరు ముంపు పాపం ప్రభుత్వాలదేనని సిపిఐ జాతీయ కార్యదర్శి కె. నారాయణ విమర్శించారు. కొల్లేరు పరిరక్షణలో భాగంగా శుక్రవారం ఏలూరు జిల్లా మండవల్లి మండలం పెనుమాక లంక గ్రామాన్ని సందర్శించారు. బుడమేరు, తమ్మిలేరు, రామిలేరు ప్రవాహాలు కలిసే చోటును పరిశీలించారు. బోటుపై కొల్లేరులో నీటి ప్రవాహాన్ని, కాలుష్యాన్ని పరిశీలించారు. అనంతరం పెనుమాకలంక గ్రామం కూడలిలో గ్రామస్తులతో సమావేశం జరిపి లంక ప్రజలతో మమేకమై సమస్యలు అడిగి తెలుసుకున్నారు.అనంతరం కె.నారాయణ మాట్లాడుతూ కొల్లేరు మాఫియా కబంధహస్తాలలో కొట్టుమిట్టాడుతుందని ధ్వజమెత్తారు. వందల ఎకరాలలో నిబంధనలు విరుద్ధంగా అక్రమంగా చేపలచెరువులు తవ్వి,సహజ సిద్ధమైన కొల్లేరును నాశనం చేశారని మండిపడ్డారు.

బుడమేరు ముఖ ద్వారం నుండి ఉప్పుటేరు వరకు కాలువలు పూడుకుపోయి నీటిపారుదల సౌకర్యం లేక వరదలు వచ్చినప్పుడు లంక గ్రామాలు నీట మునిగి ప్రజల జీవితాలు చిన్నాభిన్నం అవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం తక్షణం పూడిక తీసి,ఆక్రమణలు తొలగించి లంక ప్రజల జీవితాలను మెరుగుపరచాలని డిమాండ్ చేశారు.పాలకులు ప్రభుత్వాలు ఓట్ల కోసం కాకుండా, పదవులపై వ్యామోహం లేకుండా ప్రజల కోసం పనిచేయాలని సూచించారు.కూటమి ప్రభుత్వం యుద్ధ ప్రాతిపదికన లంక గ్రామాలలో మెరుగైన రవాణా సౌకర్యాల కోసం రహదారులు నిర్మించాలని డిమాండ్ చేశారు.పాలకులు చేపల చెరువులో అక్రమంగా తవ్వి సాగు చేసుకున్న మాఫియాను అడ్డుకోకుండా కేవలం రాజకీయ ప్రత్యర్థుల పైన మాత్రమే తమ ప్రతాపం చూపిస్తూ కొల్లేరు ప్రజల జీవితాలను అస్తవ్యస్తం చేస్తున్నారని విమర్శించారు.

మేలైన ఉపాధి లేక పెనమకలంక గ్రామంలో సగం మందికి పైగా జనాభా ఇతర ప్రాంతాలకు వలస వెళ్లారని, ప్రభుత్వం తక్షణం జోక్యం చేసుకుని వలసలు నివారించి సంవత్సరంలో 200 రోజులు పని దినాలు కల్పించాలని డిమాండ్ చేశారు.రాష్ట్ర ప్రభుత్వం చిత్తశుద్ధితో కొల్లేరుకు శాశ్వత పరిష్కారం చూపాలని డిమాండ్ చేశారు.కొల్లేరు సమస్యలు పరిష్కారం కానిపక్షంలో ఫిబ్రవరి 1నుండి దీక్షలకు సిద్ధమని నారాయణ ప్రభుత్వాన్ని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు డేగా ప్రభాకర్,సిపిఐ రాష్ట్ర కంట్రోల్ కమిషన్ కార్యదర్శి బండి వెంకటేశ్వరరావు,ఆంధ్రప్రదేశ్ మహిళా సమాఖ్య ఏలూరు జిల్లా అధ్యక్షురాలు వరకాశ్యామల, సిపిఐ ఏలూరు ఏరియా కార్యదర్శి ఉప్పులూరి హేమ శంకర్, జిల్లా కార్యవర్గ సభ్యులు పుప్పాల కన్నబాబు, ఏఐటీయూసీ ఏలూరు జిల్లా అధ్యక్షులు రెడ్డి శ్రీనివాస్ డాంగే,గ్రామ సర్పంచ్ ముంగర నాగరాజు, ముంగర వెంకటేశ్వరరావు,మాజీ సర్పంచ్ దేవమణి రాజు, గ్రామ పెద్దలు భలే కాసులు, ముంగర బాజీ, ఘంటసాల నాగరాజు, ఆంజనేయులు, సయ్యద్ సూరిబాబు, భలే జగన్మోహనరావు,ఘంటసాల సుధాకర్,భలే పరమాత్మ, మోరు వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా సమస్యలు అధికారులు పరిష్కరించాలి : ఎమ్మెల్యే బడేటి చంటి



**ఏలూరు, మేజర్ న్యూస్:**ప్రజా సమస్యల పరిష్కారమే కూటమి ప్రభుత్వ ప్రధాన ధ్యేయమని ఏలూరు ఎమ్మెల్యే బడేటి చంటి స్పష్టం చేశారు. అసెంబ్లీ నుంచి నేరుగా ఏలూరు పవర్ పేటలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో శుక్రవారం ప్రజా వినతులు స్వీకరించారు. వారికి ధైర్యం చెప్పారు. ఆయా సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టాలని ఎమ్మెల్యే బడేటి చంటి అధికారులను ఆదేశించారు.

అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రజలు తమ సమస్యలను నేరుగా తనదృష్టికి తీసుకురావచ్చునని భరోసా కల్పించారు.

## బ్రిటిష్ వలస వాద వ్యవస్థకు వ్యతిరేకంగా పోరాడిన గిరిజన నేత బిర్సా ముండా

### జిల్లా కలెక్టరు చదలవాడ నాగరాణి నివాళులు



**భీమవరం,మేజర్‌న్యూస్ :** స్థానిక కలెక్టరేటు వశిష్ట కాన్ఫరెన్స్ హాలు నందు శుక్రవారం గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో గిరిజన నాయకుడు స్వాతంత్ర్య సమరయోధుడు భగవాన్ బిర్సా ముండా జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టరు చదలవాడ నాగరాణి ముఖ్య అతిథిగా పాల్గొని బిర్సా ముండా చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టరు మాట్లాడుతూ ఆంగ్లేయుల మన దేశాన్ని పాలించే రోజులలో వారి అరాచకాలను ఎదిరించిన ఆదివాసీ యోధుడు బిర్సా ముండా ఒకరిని అన్నారు. గిరిజన నాయకుడు, స్వాతంత్ర సమరయోధుడు భగవాన్ బిర్సా ముండా జయంతిని పురస్కరించుకుని నవంబరు 15వ తేదీన భారతదేశ జాతీయ గౌరవ దివాస్ దినోత్సవంగా జరుపు కుంటున్నామని అన్నారు. భారతదేశంలో బ్రిటిష్ వాళ్ళ వలస వాద వ్యవస్థకు వ్యతిరేకంగా ధైర్యంగా గిరిజన తెగకు చెందినటువంటి యువకుడు తనకు ఉన్న జ్ఞానంతో బ్రిటిష్ వాళ్ళను ఎదిరించిన నాయకుడు భగవాన్ బిర్సా ముండాను స్ఫూర్తిగా తీసుకోవాలని గిరిజన నాయకులకు, బాలికలకు చూచించారు. ప్రస్తుత సమయంలో పుస్తకాలకు సంబంధించిన విజ్ఞానం కొరవడుతుందని, పిల్లలు ఎక్కువ సెల్ ఫోన్ వాడకంపై శ్రద్ధపెట్టుతున్నారని, స్వాతంత్ర సమరయోధుల వారి జీవిత చరిత్రను నేటి విద్యార్థులు చదివి చైతన్యం కావాలన్నారు. కేవలం 25 సంవత్సరములు మాత్రమే జీవించిన ఈయన అటవీ ప్రాంతంలో గిరిజనుల భూముల హక్కులు పరిరక్షించే చట్టములను రూపొందించి బ్రిటిష్ వారితో పోరాటం సాగించారని అన్నారు. ఈ ఆదివాసి యోధుడు గిరిజన నాయకునిగా, స్వాతంత్ర సమరయోధునిగా గుర్తింపు పొందారని అన్నారు. బీహార్ జార?ండ్ చుట్టుపక్కల నివసించిన జాతీయ ఉద్యమంపై ఏనలేని ప్రభావం చూపటం జరిగిందన్నారు. 2000 సంవత్సరంలో ఆయనకు తగిన గౌరవాన్ని అందజేస్తూ కేంద్ర ప్రభుత్వం జార?ండు రాష్ట్రాన్ని ఏర్పాటు చేసిందన్నారు. ఈయన 1875 సంవత్సరం నవంబరు 15 వ తేదీన జన్మించి 1900 సంవత్సరం జూన్ 9 తేదీన బిర్సా ముండా మరణించారని అన్నారు. బిర్సా ముండా 1886 నుండి 1890 ఆంగ్లేయుల ప్రభుత్వానికి వ్యతిరేకంగా పోరాటం సాగించారు. గిరిజనులకు తగిన శిక్షణ ఇచ్చి బ్రిటీషర్లపై పోరాట యోధులుగా తీర్చిదిద్దారని అన్నారు. 1900 సంవత్సరంలో మార్చి మూడవ తేదీన బిర్సా ముండా జమ్ కోపాయ్ అటవీ ప్రాంతంలో నిద్రిస్తున్న సమయంలో బ్రిటిష్ సైనికులు అతనిని అరెస్టు చేశారని బిర్సా ముండా ను జైలులో పెట్టిన కొద్దిరోజులకే కన్నుమూశారాని జిల్లా కలెక్టరు చదలవాడ నాగరాణి పేర్కొన్నారు.ఈసమావేశంలో జిల్లారెవిన్యూఅధికారి మొగిలి వెంకటేశ్వర్లు, జిల్లా గిరిజన సంక్షేమ శాఖ అధికారి డి.పుష్పరాణి,వసతి గృహం అధికారి డి.శ్రీనివాసు,టైపిస్ట్‌బి.కమలకుమారి,జూనియర్ అసిస్టెంటు జి.దుర్గారావు, సిబ్బంది, విద్యార్థిని విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులు మంచి పుస్తకాలు చదవాలి తహసీల్దార్ జెఎస్ సుభాని





ముదినేపల్లి,మేజర్‌న్యూస్ :విద్యార్థులు మంచి పుస్తకాలను చదువుకోవడాన్ని అలవర్చుకోవాలని తహసీల్దార్ జెఎస్ సుభాని అన్నారు.ముదినేపల్లి గ్రేడ్-3 శాఖగ్రంథాలయంలో పుస్తక ప్రదర్శనను ఎస్ఐ వి ఎస్ విరభద్రరావుతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చిన్ననాటి నుండి గ్రంథాలయాలకు వచ్చి పుస్తక పఠన చేయటం వల్ల ఈ స్థాయికి వచ్చామన్నారు.ఆడపిల్లలు స్మార్ట్ ఫోన్లు వాడకూడద న్నారు. ముఖ్యంగా ఆడపిల్లలు రోడ్ల వెంబడి వెళ్లేటప్పుడు ఏమైనా సమస్యలుంటే తమ దృష్టికి తేవాలన్నారు.6,7 తరగతులకు చిత్రలేఖనం, 8,9 తరగతులకు విద్యా - మన భవిష్యత్తు పై వ్యాస రచన పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జడ్పి స్కూల్, సహాయమాత, ఇండో సాక్సన్ విద్యార్థిని, విద్యార్థులు, గ్రంథాలయ అధికారిని ఎమ్ శ్రీదేవి సిబ్బంది పాల్గొన్నారు.

## ద్వారకాతిరుమలలో ఆక్రమణలు తొలగింపు



**ద్వారకాతిరుమల,మేజర్‌న్యూస్:** గ్రామంలో సర్వే నెంబర్ 47లో గత వైఎస్ఆర్సిపి నాయకులు కార్యకర్తలు అనధికారికంగా ఆక్రమించుకున్న స్థలాన్ని శుక్రవారం ఉదయం మండల రెవెన్యూ అధికారులు జెసిబి సహాయంతో తొలగించారు.

## దేశం పార్టీకి కొప్పాడ రాజీనామా?



**నర్సాపురం, మేజర్‌న్యూస్:** తెలుగుదేశం పార్టీసీనియర్ నాయకులు, మాజీ ఏఎంసీ చైర్మన్ కొప్పాడ రవీంద్రనాథ్ ఠాగూర్ పార్టీకి రాజీనామా చేయనున్నారు. తెలుగుదేశం పార్టీఆవిర్భావం నుండి ఆ పార్టీలో క్రియాశీలకంగా వ్యవహరించి, పార్టీ అభివృద్ధికి ఎంతో కృషి చేశారు. మున్సిపల్ కౌన్సిలర్‌గా, తెలుగుదేశం పార్టీరాష్ట్ర అగ్నికుల క్షత్రియ సాధికార కమిటీ కన్వీనర్‌గా పనిచేసి రాష్ట్రమంతా తిరిగి అగ్నికుల క్షత్రియులను పార్టీలో చేర్చడంలో, పార్టీలో క్రియాశీలకంగా వ్యవహరించడంలో ఎంతో కృషిచేశారు. ఇటీవల కూటమి ప్రభుత్వం ద్వారా కేటాయించిన నామినేటెడ్ పోస్టులలో అగ్నికుల క్షత్రియులకు ప్రాధాన్యత ఇవ్వకపోవడంతో ఆ వర్గం నుండి రవీంద్రనాథ్ ఠాగూర్ పై తీవ్రమైన ఒత్తిడి వస్తున్నట్లు తెలిసింది. నర్సాపురం నుండి ఇప్పటికే క్యాబినెట్ హెూదా కలిగిన పదవిని తెలుగుదేశం పార్టీ తరఫున ఎంఎ షరీఫ్ కు ఇచ్చారు. జనసేన నాయకుడు మాజీ మంత్రి కొత్తపల్లి సుబ్బారాయుడుకు కాపు కార్పొరేషన్ చైర్మన్, ఎమ్మెల్యే బొమ్మిడి నాయకర్‌కు ప్రభుత్వ విప్ ఇవ్వటంతో ఇక నరసాపురానికి పదవులు వచ్చే అవకాశం కూడా లేదు. మొన్నటివరకు రవీంద్రనాథ్ ఠాగూర్ చేసిన రాష్ట్ర అగ్నికుల క్షత్రియ సాధికార కమిటీ కన్వీనర్ కూడా జనసేన పార్టీకి చెందిన వ్యక్తికి కేటాయించారు. ఇక అగ్నికుల క్షత్రియులకు పదవులు వచ్చే అవకాశం కనిపించకపోవడంతో కొప్పాడను రాజీనామా చేయించాలని ఆయన వర్గీయులు ఇప్పటికే నిర్ణయించుకున్నారు. గత వైసిపి ప్రభుత్వంలో నరసాపురం చెందిన తిరుమణి నాగరాజు, బర్రె లీలా శంకర్‌కు కార్పొరేషన్ చైర్మన్ పదవులులభించాయి. ఈ ప్రభుత్వంలో పార్టీ అభివృద్ధికి పని చేసిన అగ్నికుల క్షత్రియులకు గుర్తింపు ఇవ్వకపోవడంతో రాజీనామాకు సిద్ధపడినట్లు చెబుతు న్నారు. రెండు రోజుల్లో అధికారకంగా ప్రకటించే అవకాశం ఉందని వారు చెప్తున్నారు. క్రమశిక్షణకు మారుపేరుగా, పార్టీ అధినాయకుడు ఆదేశాలే శిరోధార్యముగా భావించి పనిచేస్తున్న రవీంద్రనాథ్ ఠాగూర్ లాంటి వ్యక్తులు పార్టీకి దూరమవ్వటం దురదృష్టంగానే భావించాలి.